
అలిగివెళ్లిపోతున్న అశోక్‌కుమార్‌రెడ్డి వర్గీయులు(ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

తొలి అధికారిక కార్యక్రమంలోనే
మంత్రికి షాక్

కొండపి నియోజకవర్గ వైసీపీలో మళ్లీ భగ్గుమన్న వర్గ విభేదాలు
ఇన్‌చార్జిగా నియమితులైన ఆదిమూలపు చేతుల మీదుగా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు
వేదికపైకి ఆహ్వానించకపోవడంతో అలిగి వెళ్లిన డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి
కొత్తగా వచ్చి తగాదాలు పెడతారా అంటూ ఆయన వర్గీయులు ఆగ్రహం
రాయభారం నడిపేందుకు సీఐ రంగనాథ్ ప్రయత్నం

సింగరాయకొండ, జనవరి 4 : కొండపి నియోజకవర్గానికి కొత్త ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు తొలి అధికారిక కార్యక్రమమే షాక్ ఇచ్చింది. ఆయన నిర్వహించిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం రసాభాసాగా మారింది. వైసీపీలో ఉన్న వర్గవిభేదాలు మంత్రి సాక్షిగా మరోసారి బహిర్గతం కావడం చర్చనీయాంశమైంది. హంగూఆర్భాటంతో ఏర్పాట్లు చేసినప్పటికీ నేతల మధ్య వైరాలు మంత్రి సురేష్‌కు తలనొప్పిని తెచ్చిపెట్టింది. వివరాల్లోకెళ్తే... సింగరాయకొండ మండలానికి కొత్తగా మంజూరైన పింఛన్లను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి సురేష్ చేత పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం అట్టహాసంగా ఏర్పాట్లు చేసింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో భారీ సభా వేదికను ఏర్పాటు చేశారు. వేదికమీదకు వైసీపీ వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డిని ఎంపీడీవో జమీవుల్లా ఆహ్వానించలేదు. దీనిని అవమానంగా భావించిన అతను బయటకెళ్లిపోయారు. దీంతో అతని వర్గీయులు మంత్రి, ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రిగా ఉన్న వ్యక్తికి ప్రొటోకాల్ తెలియదా, తగాదాలు పెట్టడానికి ఇక్కడకు వచ్చారా అని ఆగ్రహంతో ఊగిపోయారు. అశోక్‌కుమార్‌రెడ్డిని వెనక్కి తీసుకురావడం కోసం సీఐ రంగనాథ్ ఆయన వద్దకెళ్లారు. అప్పటికే ఆయన ఊళ్లపాలెం వెళ్లారు. దాదాపు గంటసేపు అశోక్‌కుమార్‌రెడ్డి ఇంటి వద్దే సీఐ వేచిఉన్నారు. అప్పటికీ ఆయన రాకపోవడంతో సీఐ తిరిగి ఎంపీడీవో కార్యాలయం వద్దకు వచ్చారు.

ఆహ్వానం పలికేందుకు జాతీయ రహదారిపైకి..

తొలుత మంత్రి సురేష్ కాన్వాయ్‌కు డాక్టర్ శివరామిరెడ్డి ఆసుపత్రి ఎదుట అశోక్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలకటానికి సిద్ధంగా ఉన్నారు. ఈ తరుణంలో మంత్రి కాన్వాయ్ మధ్యలో ఆగదని సమాచారం రావడంతో డాక్టర్ తన వర్గీయులతో కలిసి హైవే వద్దకెళ్లారు. అక్కడ మంత్రి తన కారును అలా నిలిపి నేరుగా ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ వైసీపీలో ఉన్న మరోవర్గం నేత ఆ పార్టీ మండల కన్వీనర్ సామంతుల రవికుమార్‌రెడ్డి తన అనుచరులతో కలిసి మంత్రికి ఘనంగా స్వాగతం పలికి సభావేదిక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అశోక్‌కుమార్‌రెడ్డి తటస్థంగా నిలబడిపోయారు. అనంతరం ఎంపీడీవో వేదిక పైకి పార్టీ పదవుల్లో ఉన్న నేతలను ఆహ్వానించినా అశోక్‌కుమార్‌రెడ్డిని పట్టించుకోలేదు. దీంతో వేదిక వద్దకు ఆయన వర్గీయులు వచ్చి రాష్ట్ర హోదాలో ఉన్న వ్యక్తిని పిలవరా అని ఎంపీడీవోని ప్రశ్నించారు. అప్పుడు ఆయన అశోక్‌కుమార్‌రెడ్డిని ఆహ్వానించగా అప్పటికే ఆయన వెళ్లిపోయారు. ఇదిలా ఉంటే మంత్రి సురేష్ తిరుగు ప్రయాణంలో కూడా డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డిని పట్టించుకోకపోవడాన్ని అవమానంగా భావించారు.

పాదాభివందనాలు చేస్తున్నా..
ఒక్కసారి ఆదరించండి : మంత్రి

ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ తాను ఎర్రగొండపాలెం, సంతనూతలపాడులో పోటీచేసి గెలుపొందానని, మూడోసారి కొండపి నియోజకవర్గానికి జగనన్న పంపించారని చెప్పారు. ప్రతి ఒక్కరికీ పాదాభివందనాలు చేస్తున్నా ఒక్కసారి అవకాశం ఇవ్వండని అభ్యర్థించారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లనుఅందజేశారు. తొలుత వైసీపీ నేతలు మాట్లాడే సమయంలో అధికభాగం మంత్రి వేదికపై కనుకు తీయడం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ, మత్స్యశాఖ జేడా చంద్రశేఖర్, తహసీల్దార్ ఉష, ఎంపీపీ కట్టా శోభారాణి, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణమ్మ, సర్పంచ్ తాటిపర్తి వనజ, మండల వైస్‌ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జరుగుమల్లిలోనూ ఎవరికివారే యమునా తీరే..

జరుగుమల్లి (కొండపి), జనవరి 4 : జరుగుమల్లి మండల కార్యాలయంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొన్నప్పటికీ నేతలు మాత్రం గ్రూపులుగా ఏర్పడి ఎడముఖం, పెడముఖంగా వ్యవహరించారు. ఎంపీపీ బెల్లం నిర్మల, ఆమె భర్త మాజీ ఎంపీపీ సత్యనారాయణ వారి అనుచరులు ఒక గ్రూపుగా, వైసీపీ మండల అధ్యక్షుడు బత్తిన మనోహర్, ఆయన వర్గీయులు రెండు వర్గాలుగా విడిపోయి కార్యక్రమానికి హాజరయ్యారు.


సిద్ధమైన వేదికపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న డాక్టర్ ఉగ్ర, ఏలూరి, దామచర్ల సత్య, నాయకులు

నేడే సమర శంఖారావం

పూరించనున్న చంద్రబాబు
కనిగిరి సభకు సకల ఏర్పాట్లు
వెలిగొండ సాధన ప్రాంగణంగా నామకరణం
భారీఎత్తున తరలిరానున్న టీడీపీ నేతలు, శ్రేణులు

కనిగిరి, జనవరి 4 : రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల వేడి రాజుకుంటోంది. అందులో భాగంగా మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించేందుకు కనిగిరిలో తొలి ఎన్నికల సభకు నాంది పలకనున్నారు. శుక్రవారం కనిగిరి - సీఎస్‌పురం రోడ్డులో కనిగిరి పట్టణానికి అతి సమీపంలో సభావేదిక వద్దకు సాయంత్రం 3 గంటలకు చంద్రబాబు చేరుకోనున్నారు. అందుకోసం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర అన్ని సకల ఏర్పాట్లను పూర్తి చేశారు. వేదికకు వెలిగొండ సాధన ప్రాంగణంగా నామకరణం చేశారు. ఇప్పటికే సభావేదిక సిద్ధం కాగా, ప్రాంగణంలో అన్ని హంగుల ఏర్పాటుకు ఉగ్ర ఆధ్వర్యంలో పనులు పూర్తి కానున్నాయి. జిల్లాలోని టీడీపీ ఇన్‌చార్జిలు, ముఖ్యనేతల పర్యవేక్షణలో చంద్రబాబు బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లను చేపట్టారు. ఫొటో గ్యాలరీలతో పాటు వీఐపీ, మహిళా గ్యాలరీలను సిద్ధం చేశారు. ఫ్లడ్‌లైట్ల కాంతితో వేదికను ప్రత్యేక ఆకర్షణగా సిద్ధం చేశారు. పోలీసు యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. ఏఎస్పీ శ్రీధర్‌రావు, డీఎస్పీ రామరాజుతోపాటు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు మాధవరావు పోలీసు సిబ్బందితో కలసి సభాప్రాంగణాన్ని పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు ఏఎస్పీ తెలిపారు. చంద్రబాబు ప్రత్యేక హెలికాప్టర్‌లో రానుండడంతో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. సభ ఏర్పాట్లు, చంద్రబాబు షెడ్యూల్, ముఖ్యుల కలయిక వంటి వివరాలపై ఉగ్రతో వారు చర్చించారు. గురువారం టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, దామచర్ల సత్య సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కనిగిరి క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, గుదే రమణయ్య, గంగవరపు నాగిరెడ్డి, సిద్దాటపు వెంకటరెడ్డి, సైకం మాలకొండారెడ్డి, న్యాయవాది మహ్మద్ వలి, వడ్డెంపూడి శ్రీనివాసులురెడ్డి, రోషన్ సంధాని, షరీఫ్, గుడిపాటి ఖాదర్, గారపాటి రమణయ్య, బాలు ఓబులురెడ్డి, గంజికుంట శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇంకా పడలే!

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4 : కొన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇంకా పడలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు పడాల్సిన ఉంది. కానీ నెల ప్రారంభమై నాలుగు రోజులు గడిచినా ఇంకా 40 శాతం మందికి అందలేదు. కొన్నిశాఖలకు పూర్తిస్థాయిలో జీతాలు పడగా, మరికొన్ని శాఖల్లో కొంతమందికే పడ్డాయి. ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రం ఎదురుచూపులే మిగిలాయి. జిల్లాలో పదివేల మందికిపైగా ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, మరో 20వేల మంది వరకు రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 55వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉండగా వారిలో 60శాతం మంది ఉద్యోగులకు మాత్రమే జీతాలు పడ్డాయి. మిగిలిన 40 శాతం మంది ఉద్యోగులకు జీతాలు పడలేదు. ప్రధానంగా ప్రతినెల ఉపాధ్యాయులకు ఇదే పరిస్థితి నెలకొంది. ఇతర శాఖల ఉద్యోగులకు నాలుగైదు తేదీల్లో జీతాలు పడుతున్నా ఉపాధ్యాయుల జీతాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఏసీబీకి చిక్కిన దర్శి ఎస్ఐ మెయిన్‌లో...

కనిగిరి వైపే
జనం

టీడీపీ అధినేత చంద్రబాబు సభకు భారీ ఏర్పాట్లు
స్థానికుల్లో ఐదు గ్యారెంటీలపై విస్తృత చర్చ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కనిగిరిలో శుక్రవారం సాయంత్రం చంద్రబాబునాయుడు పాల్గొంటున్న బహిరంగసభకు భారీ ఏర్పాట్లు జరిగాయి. వేదికకు వెలిగొండ ప్రాజెక్టు సాధన ప్రాంగణంగా పేరు పెట్టడంతోనే పశ్చిమప్రాంత ప్రజల్లో మంచి స్పందన వచ్చింది. దీనికితోడు కనిగిరి నియోజకవర్గ అభివృద్ధిపై ఉగ్రనరసింహారెడ్డి ప్రకటించిన ఐదు గ్యారెంటీలపై కూడా విస్తృత చర్చ జరుగుతోంది. వీటన్నిటికీ తోడు ఒంగోలు పార్లమెంటు స్థానం పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు కదిలి విస్తృత ప్రచారం చేపట్టడంతో ప్రజల్లో మంచిస్పందన కనిపిస్తోంది. తదనుగుణంగా శుక్రవారం సాయంత్రం కనిగిరి నుంచి వెలిగండ్ల వెళ్లేమార్గంలో కొత్తూరు ప్రాంతంలో ఏర్పాటుచేసిన బహిరంగసభకు భారీగా ప్రజలు తరలిరానున్నారు. ఇప్పటికే తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి ఎన్నికల రంగంలోకి దిగాయి. దీంతో జనసేన నాయకులను కూడా ఈ సభకు ఆహ్వానించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల నుంచి జనసేన కేడర్ కూడా సభకు రానున్నారు. కనిగిరిలో ఉగ్రతోపాటు ఎమ్మెల్యే ఏలూరి, నాయకులు దామచర్ల సత్య తదితరులు మకాం వేసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి ముందుగా సభకు వచ్చే ప్రజలకు అన్ని ఏర్పాట్లు చేశారు. రాత్రి సభానంతరం కూడా భోజనం వసతి కల్పించారు. లక్షమందికిపైగా పట్టే ఆవరణలో సభ ఏర్పాటు చేయటమే గాక సమీపంలోనే హెలిప్యాడ్‌ను అక్కడే భోజన ఏర్పాట్లు కూడా ఉండే విధంగా 30ఎకరాల స్థలంలో సర్వం సిద్ధమయ్యాయి. వెలిగొండ ప్రాజెక్టు సాధన ప్రాంగణం పేరు పెట్టడం ద్వారా చంద్రబాబు ప్రాజెక్టు విషయంలో భవిష్యత్తుపై మంచి ప్రకటన చేయవచ్చని భావిస్తున్నారు. అలాగే మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశం కూడా ప్రస్తావించవచ్చని భావిస్తున్నారు. కనిగిరికి సంబంధించి వెలిగొండ ప్రాజెక్టుతో పాటు నిమ్జ్, ట్రిపుల్ ఐటీ నిర్మాణం, సమ్మర్‌స్టోరేజి ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇచ్చే పథకం, నడికుడి-శ్రీకాళహస్తి రైలుమార్గం పూర్తి అనే ఐదు గ్యారెంటీలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లవచ్చని, తద్వారా ఆయన నుంచి హామీ రావచ్చన్న ఆశాభావం నియోజకవర్గ ప్రజల్లో వ్యక్తమవుతోంది. తదనుగుణంగా ఆ నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరాబోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కాగా రాత్రికి అక్కడే బసచేసే చంద్రబాబు శుక్రవారం ఉదయం ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో సమీక్ష నిర్వహించనున్నారు. డాక్టరు ఉగ్ర నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌ను సందర్శించనున్నారు.

9 నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

ఒంగోలు(విద్య), జనవరి 4 : అకడమిక్ క్యాలెండర్ ప్రకారం అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలకు ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్ సుబ్బారావు తెలిపారు. పది రోజుల సెలవుల అనంతరం ఈ నెల 19న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని ఆయన తెలిపారు.

వైద్యఆరోగ్యశాఖలో నియామకాలపై విచారణ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4 : జిల్లా వైద్యఆరోగ్యశాఖలో 2020 ఏడాదిలో జరిగిన ఉద్యోగ నియామకాలపై వైద్యశాఖ ఆర్డీ డాక్టర్ శోభారాణి విచారణ చేపట్టారు. రిక్రూట్‌మెంట్‌లో భారీ అక్రమాలు జరిగాయని కడప జిల్లాకు చెందిన నారపరెడ్డి అనే వ్యక్తి వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌డి శోభారాణి గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖలో విచారణ చేపట్టారు. వైద్యఆరోగ్యశాఖలో అప్పటి ఉద్యోగ నియామకాలపై కలెక్టర్ దినేష్‌కుమార్ సమగ్ర విచారణకు ఆదేశించారని ఆర్డీ దృష్టికి తీసుకెళ్ళారు. ఆ నియామకాలపై జడ్పీ సీఈవో జాలిరెడ్డి 40 రోజుల పాటు విచారణ చేశారని, నివేదికను కలెక్టర్‌కు ఇచ్చిన వెంటనే అక్రమాలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటామని ఆర్డీ దృష్టికి తీసుకెళ్ళినట్లు సమాచారం. వాసంతి అనే ఉద్యోగి తొలగింపునకు సంబంధించి ఆ ఉద్యోగి రాతపూర్వకంగా ఇచ్చిన అర్జీలను ఆర్‌డఈకి అందించారు. 2020 నియామకాలపై సమగ్ర విచారణ వచ్చాకే అక్రమాలు జరిగి ఉంటే సంబంధితులపై చర్యలు తీసుకుంటామని వైద్యశాఖ అధికారులు చెప్పినట్లు తెలిసింది.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4 : రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఒంగోలులోని డీఆర్సీభవన్‌లో ఆత్మ ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ విస్తరణాధికారులు, సాంకేతిక సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయిలో పనిచేస్తున్న ప్రతి ఒక్క వ్యవసాయ సిబ్బంది వారి పరిధిలోని రైతుకు సంబంధించిన వ్యవసాయ అకౌంట్ కలిగి ఉండాలన్నారు అలా చేసినప్పుడే వారికి ఆదాయ, వ్యయ వివరాలు తెలుసుకోవడంతో పాటు వారి ఆర్థిక స్థాయి పెంచేందుకు సరైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటుకు సహకరించాలన్నారు. శిక్షణలో అన్ని అంశాలను తెలుసుకొని క్షేత్రస్థాయిలో వినియోగించాలని సూచించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు ఎస్.శ్రీనివాసరావు, వెంకటరమణ, సుధాకరరాజు, ఎస్.గోపీచంద్, సుజయ్‌కుమార్, కేవీఎస్.ఉపేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4 : యువత బాధ్యతగా కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని వేదిక అధ్యక్షుడు మాగులూరి నాగేశ్వరరావు కోరారు. సుపరిపాలన వేదిక, ఎన్నికల నిఘా వేదిక ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని ఆంధ్రకేసరి విద్యాకేంద్రం డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రానున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కంచర్ల సుబ్బారావు, డాక్టర్ షాకిర్, ఎంవీ.శేషయ్య, సుంకర సాయిబాబా, చక్కా రంగనాథం, నాగభూషణం, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, లెక్చరర్ విజయలక్ష్మి, దండే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

బీజేపీ పాలనలో దుర్భరంగా మైనార్టీల జీవితాలు



సమావేశంలో మాట్లాడుతున్న అఫ్సర్

ఒంగోలు(విద్య), జనవరి 4: బీజేపీ పాలనలో దేశంలోని మైనార్టీల వర్గాల జీవితాలు మరింత దుర్భరంగా మారాయని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సయ్యద్ అఫ్సర్ ధ్వజమెత్తారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో గురువారం జరిగిన ఇన్సాఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఎస్‌డీ.సర్దార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అఫ్సర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనార్టీల పట్ల చిన్న చూపు చూస్తుందని, గతంలో మైనార్టీల విద్యకు రూ.160 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది కేవలం రూ.10 కోట్లు కేటాయించారని ఆరోపించారు. వక్ఫ్ బోర్డును రద్దు ప్రకటనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోసంరక్షణ దళాల పేరుతో నిత్యం దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. తన రాజకీయ లబ్ధికోసం బీజేపీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం కూడా ముస్లింలకు తీవ్ర అన్యాయం చేసిందని, వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం హక్కులను కాలరాస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో సయ్యద్‌యాసిన్, సిలార్, ఎస్‌డీ.మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానమే భక్తికి మార్గం

ఒంగోలు(కల్చరల్), జనవరి 4: జ్ఞాన సముపార్జనే భక్తికి ఏకైక మార్గమని ప్రవచకులు నెమ్మాని సీతారామమూర్తి పేర్కొన్నారు. గురువారం స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో ఆయన తిరుప్పావై 19వ పాశుర ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల



కార్మికుల సమస్యలను ఆలకిస్తున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 4 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరుగుతున్న కార్మికుల దీక్షకు దామచర్ల సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఒక్క చాన్స్ పేరుతో పాదయాత్రలో అన్ని అబద్ధాలు చెప్పిన జగన్‌రెడ్డి అందరినీ మోసం చేశారన్నారు. అధికారంలోకి రాకముందు ఒకలా, వచ్చాక ఒకలా వ్యవహరిస్తూ నియంత పాలన సాగిస్తున్నారని, ఏ ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడంతో ఇపుడు ఉద్యోగులు, కార్మికులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు అందరు తిరుగుబాటు చేశారని చెప్పారు. త్వరలోనే ప్రజలు కూడా తిరుగుబాటు చేసి తగిన రీతిలో తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని దామచర్ల పేర్కొన్నారు. ఒకవైపు క్లీన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంటూ గొప్పలు చెబుతున్న జగన్‌రెడ్డి చెత్తపైనా ట్యాక్స్ విధించి దోచుకుంటున్నారని విమర్శించారు. కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటూ వారి న్యాయమైన డిమాండ్లపై కనీసం నోరు విప్పకుండా ప్రజారోగ్యంతో చెలగాటమాడతున్న జగన్‌రెడ్డిని శాశ్వతంగా ఇంటికి పంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఒకవైపు ధరలమోత, ఇంకోవైపు ఆర్టీసీ చార్జీల భారం, కరెంటు బిల్లుల షాక్ ఇలా ఒక్కటేమిటి అన్నీ ఇష్టారాజ్యంగా పెంచేసి సామాన్యుడు సంతోషంగా జీవించే అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు. జగన్ రెడ్డి రాచరిక పాలనకు చరమగీతం పాడాలన్నారు. కార్మికులు, ఉద్యోగులు, అన్ని వర్గాల వారు అండగా ఉండి టీడీపీని గెలిపించాని కోరారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రానే మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం అవుతాయని తెలిపారు. ఇదిలా ఉండగా, కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు వ్యక్తులతో చేపడుతున్న పారిశుధ్య పనులను అడ్డుకుని చెత్తవాహనాలను ఆపేశారు.

ఎస్ఈబీలో ఎన్నికల బదిలీలపై కసరత్తు

- ఆప్షన్స్ తీసుకున్న అధికారులు



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజు తదితరులు

ఒంగోలు(క్రైం), జనవరి 4: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీ ప్రక్రియకు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు చెందిన ఎస్ఈబీ సిబ్బంది వివరాలను సేకరించారు. గురువారం ఒంగోలులోని పోలీసు కళ్యాణమండపంలో ఈ మేరకు ప్రస్తుతం ఉన్న గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన అధికారులు సమావేశమయ్యారు. నెల్లూరు రీజియన్ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నివేదికలు తయారు చేశారు. ఈ ఏడాది జూన్ 30 వరకు పరిగణనలోకి తీసుకొని మూడేళ్లు నిండిన ఎస్సై నుంచి ఆపై అధికారులను బదిలీ చేయాలని నిర్ణయించారు. అంతేగాకుండా సొంత జిల్లాలో పనిచేసే అధికారులను తప్పనిసరిగా ఇతర జిల్లాకు బదిలీ చేయనున్నారు. అదేక్రమంలో ఎస్సైల వరకు డివిజన్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం ఒంగోలు డివిజన్‌లో పనిచేస్తున్న వారు మార్కాపురం డివిజన్‌కు బదిలీ చేస్తారు. సీఐ, ఆ పైస్థాయి అధికారులు అయితే కచ్చితంగా జిల్లా నుంచి తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. అదేక్రమంలో ఆయా అధికారుల నుంచి నాలుగు ప్రాంతాల్లో ఆప్షన్స్ తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి బదిలీల ప్రక్రియ చేపట్టామని ఎస్ఈబీ అధికారులు తెలిపారు. సమావేశంలో ఎస్ఈబీ ఇన్‌చార్జి జేడీ, ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, తిరుపతి జేడీ ఎ.రాజేంద్ర, గుంటూరు జేడీ ఎం.వెంకటేశ్వర్లు, బాపట్ల జేడీ పి.మహేష్, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, ప్రకాశం ఎస్ఈబీ ఈఎస్ ఎం.సుధీర్ బాబు పాల్గొన్నారు.

షాపునకు అడ్డమని..చేతిపంపునే తీసేశారు..!

- వైసీపీ కార్పొరేటర్ అండదండలు
- అధికారుల మౌనం



చేతిపంపు(బోరు)ను పూర్తిగా తొలగిస్తున్న కూలీ

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 4 : నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తూ, రద్దీగా ఉండే ఒంగోలులోని సాయిబాబా గుడి సెంటర్‌లో ప్రజల తాగునీటి అవసరాల కోసం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి పంపు (బోరింగ్)ను వైసీపీ కార్పొరేటర్ అండదండలతో తొలగించారు. స్థానిక లాయరుపేటలోని రైతుబజార్ ఎదురుగా దాదాపు పదిహేనుసంవత్సరాల క్రితం అక్కడి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేతిపంపు ఏర్పాటు చేశారు. అందులో మంచినీరు రావడంతో అందరికీ ఉపయోగకరంగా ఉంది. అయితే ఇటీవల రైతుబజారు ఆఫీసు రూమును సైతం తొలగించి, బేకరికి అద్దెకు కేటాయించారు. నిబంధనల ప్రకారం రైతుబజారులో ఎస్టేట్ కార్యాలయంగా ఉండాల్సిన రూమును ఇతర ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడంతోపాటు త్వరలోనే ఇక్కడ బేకరి ప్రారంభోత్సవం చేస్తుండగా, దుకాణానికి అడ్డుగా ఉందని చేతిపంపును తొలగించారు. అయితే కార్పొరేషన్ అధికారులు సైతం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. అయితే అందిన సమాచారం మేరకు స్థానిక కార్పొరేటర్ సదరు వ్యాపారి వద్ద భారీగా ముడుపులు తీసుకుని, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని హెచ్చరించడంతో ఆవైపు కన్నెత్తి చూడానికి కూడా అధికారులు వెళ్ళకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఇదే విషయాన్ని స్థానిక ప్రజలు తప్పు పడుతున్నారు. ప్రజలకు అవసరాల కోసం ఏర్పాటు చేసిన చేతి పంపు తొలగించడం మరీ అధికార అహంకారానికి నిదర్శనంగా నిలుస్తుందని విమర్శిస్తున్నారు. తొలగించిన చేతిపంపును మరలా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగుల మనోభావాలు దెబ్బతీయడం తగదు

- సమగ్ర శిక్ష జేఏసీ నాయకుల ధ్వజం



నిరసన దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4: సమగ్రశిక్ష ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు హెచ్చరించారు. జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదట చేట్టిన దీక్షలు 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ స్టేట్ ప్రాజెక్టు అధికారి ఏర్పాటు చేసిన వెబ్ ఎక్స్ సమావేశంలో కేజీబీవీ మహిళా ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వారికి జరిగిన అవమానాన్ని రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ జరిగినట్లు భావించి రాష్ట్ర ప్రాజెక్టు అధికారి తన మాటలను వెనుక్కు తీసుకోవడంతో పాటు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం చేపట్టిన రాష్ట్ర ఎస్పీడి కార్యాలయ ముట్టడిలో సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్కూలు అసిస్టెంట్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నక్కా శరత్‌బాబు సంఘీభావం తెలిపారు. నాగులుప్పలపాడు ఎంఈవోలు ఈవీ.రమణయ్య, టి.రవిబాబు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ తగ్గించడం అన్యాయం

- 24వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె
- కొనసాగుతున్న ఆందోళన



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ఒంగోలు నగరం, జనవరి 4: డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరింది. యథావిధిగా కార్యకర్తలు, ఆయాలు జిల్లా కేంద్రంలో ప్రకాశం భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలను కొనసాగించారు. ఒంగోలులో ధర్నా కార్యక్రమానికి అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ జిల్లా నాయకురాలు హేమేమా అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ ధర్నాను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రప్రభుత్వం ఐసీడీఎస్‌కు బడ్జెట్‌ను తగ్గించి వేయటం దుర్మార్గమన్నారు. బడుగు బలహీనవర్గాల తలులకు, గర్భవతులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించటంలో ప్రధాన భూమిక పోషిస్తున్న వర్కర్లకు కనీస వేతనాలను అందించటానికి రాష్ట్రప్రభుత్వం వెనకడుగు వేయటం శోచనీయమన్నారు. అంగన్‌వాడీల పట్ల వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తుందనాన్నరు. న్యాయం కోసం గత 24 రోజులుగా మహిళలు రోడ్ల మీదకి వచ్చి ఆందోళన కొనసాగిస్తుంటే రాష్ట్రప్రభుత్వం చోద్యం చూస్తుందని ఆమె విమర్శించారు. కడుపు మండి వర్కర్లు చేస్తున్న ఆందోళనను పట్టించుకోకుండా దున్నపోతు మీద వాన కురిసిన మాదిరిగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆమె విమర్శించారు. రాష్ట్ర తెలుగు మహిళ విభాగం అధ్యక్షురాలు మోజేటి సునీత మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వమన్నారు. ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి తంగిరాల మహేష్, ఉపాధ్యక్షులు ఎస్‌డి.హుస్సేన్, యూనియన్ నాయకులు శ్రీదేవి, పద్మ, శేషమ్మ, మౌలిక, రాజేశ్వరి, కోటేశ్వరి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4 : అంధుల ఆరాధ్యదైవం, బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలు ఒంగోలులో ఘనంగా జరిగాయి. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఉన్న బ్రెయిలీ విగ్రహానికి డీఆర్వో ఆర్.శ్రీలత, వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అర్చన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్పందన హాలులో జరిగిన సభలో డీఆర్వో మాట్లాడుతూ అంధుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో అంధులు ఇంటి వద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకోనే సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అంధుల అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నటరాజు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరీ రామ్మోహన్‌రావు, చిట్టి శ్రీనివాసరెడ్డి, బోదాల చెన్నయ్య తదితరులు మాట్లాడుతూ అంధులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు సునీల్ కన్నా, రవికుమార్, రజనీకుమారి, ధనలక్ష్మి, ఝాన్సీ పాల్గొన్నారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో శ్రీలత

టీచర్ల ఉద్యోగోన్నతులపై వినతి

ఒంగోలు(విద్య), జనవరి 4: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న టీచర్ల ఉద్యోగోన్నతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ ప్రతినిధి బృందం డీఈవో వీఎస్.సుబ్బారావును విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న టీచర్ల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ యూటీఎఫ్ నాయకులు గురువారం ఒంగోలులో డీఈవోను కలిసి మాట్లాడారు. స్పాట్ వాల్యువేషన్ బకాయిలు వెంటనే చెల్లించాలని, డివిజన్ కేంద్రాల్లో కోర్సులు నిర్వహించి సర్వీసు రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చి యాంటిసిడెంట్ రిపోర్టులు ప్రకటించాలని, ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ టీచర్ల పీఎఫ్ ఖాతాలు ప్రారంభించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులతో బదిలీలైన టీచర్ల జీతాల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఓవీ.వీరారెడ్డి, డి. వీరాంజనేయులు, ఎస్.రవి, సహాధ్యక్షుడు అబ్దుల్‌హై, కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రేపు జూనియర్ బాలుర హాకీ జట్ల ఎంపికలు

సంతనూతలపాడు, జనవరి 4: జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న శనివారం జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపికలు జరుగనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ.రమణారెడ్డి, ఎ.సుందరరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధృవీకరణపత్రం తీసుకుని ఈనెల 6న ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ వద్దనున్న డీఆర్ఆర్ఎంఎం హైస్కూల్ క్రీడామైదానం వద్దకు రావాలని తెలిపారు. 1-1-2005 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9, 10, 11, 12 తేదీల్లో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని, వివరాలకు 7569872979 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

అవీ..ఇవీ..

చంద్రబాబు హామీపై హర్షం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4: రాష్ట్రంలో నిర్వీర్యమవుతున్న పంచాయతీరాజ్ వ్యవస్థను రానున్న కాలంలో బలోపేతానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ పట్ల సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో తాడేపల్లిలో జరిగిన సదస్సులో చందరబాబు స్థానిక సంస్థల బలోపేతానికి 73,74 రాజ్యాంగ సవరణలు యధాతథంగా అమలు, ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీలకు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, గౌరవ వేతనం పెంపు తదితర అనేక అంశాలపై హామీలు ఇవ్వడం అభినందనీయమన్నారు.

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలి

ఒంగోలు(క్రైం), జనవరి 4: ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని దళిత సంఘాల నాయకులు గురువారం ఒంగోలులో ఎస్పీ మలికగర్గ్‌ను కలిసి విన్నవించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై గతంలో భౌతిక దాడులు మాత్రమే జరిగాయని, ప్రస్తుతం అత్యాచారలు పెరిగాయని వివరించారు. ఈ మేరకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని కోరగా ఎస్పీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సుజన్‌మాదిగ, వెంగళరావు, యోహాన్, దండేల కృష్ణ పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను విడుదల చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న మునిసిపల్ కార్మికులను ప్రభుత్వం అన్యాయంగా అరెస్టులు చేయించిందని, వారిని వెంటనే విడుదల చేయాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.పెద్దన్న, జె.కిషోర్‌బాబు, డీవీఎస్.స్వామి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ఆమోదించి సమ్మె విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకొని పోయి ప్రజలు వ్యాధులబారిన పడే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

ఎయిడెడ్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(విద్య), జనవరి 4: ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్‌ను ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, ప్రభాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ టీచర్లకు పీఎఫ్ అకౌంట్ ప్రారంభించేందుకు అనుమతించాలని, విద్యార్థులు లేని పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను శాశ్వతంగా ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని వారు కోరారు

ఎజ్రాశాస్త్రికి పడాల రామారావు పురస్కారం

ఒంగోలు(కల్చరల్), జనవరి 4: జిల్లాకు చెందిన ప్రముఖ కవి, నవలా రచయిత దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి ప్రతిష్ఠాత్మక పడాల రామారావు స్మారక పురస్కారానికి ఎంపికయ్యారు. ఈమేరకు ఎజ్రాశాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగే పడాల రామారావు శత జయంతి ఉత్సవంలో ప్రముఖుల చేతులమీదుగా ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు. తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన అరసం కార్యవర్గానికి, నిర్వాహకులు పడాల వీరభద్రరావుకు ఎజ్రాశాస్త్రి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఎజ్రాశాస్త్రికి జిల్లా సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

ఇంటింటికీ శ్రీరామపాద అక్షతలు



అక్షతలను పంపిణీ చేస్తున్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 4: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అక్కడి నుంచి వచ్చిన శ్రీరామపాద స్వర్ణ అక్షతలను గురువారం స్థానిక సీతారాంపురంలో మహిళాబృందం ఇంటింటికీ పంపిణీ చేశారు. సీతారాంపురం సాయి సత్సంగ మందిరం నుంచి బయల్దేరిన వారు అక్షతలు, అయోధ్య రామమందిర చిత్రం, అక్షతలను ఎలా వాడాలో వివరించే కరపత్రాలను గృహిణులకు అందజేశారు. ఎయిమ్స్ క్లబ్ జాతీయ అధ్యక్షులు జంధ్యం రాధారమణ గుప్తా దంపతులకు తొలిగా వీటిని అందజేసిన భక్తబృందం తర్వాత ఆ ప్రాంతంలోని ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనిశెట్టి పావని, తీగల సత్యవతి, ఏల్చూరి భువనేశ్వరి, ఇంకొల్లు లక్ష్మి, అనూరాధ, శ్రీదేవి, అమూల్య, తెనాలి ప్రసన్న, సంధ్యారాణి, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4 : ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ జనరల్ హాస్పటల్ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో వంద మందికిపైగా విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఆపన్నులకు అండగా నిలవాలని కోరారు. రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే.మూర్తి, ఏఓ ఎం.రమణబాబు, డీన్ ఆర్.వీరాంజనేయులు, మద్దిశెట్టి కళ్యాణ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.మల్లికార్జునరావు, వి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు జరుగుమల్లిలో 'స్పందన'

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4: జరుగుమల్లిలో శుక్రవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జరుగుమల్లిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్పందన జరుగుతుందని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 12వ తేదీన పొన్నలూరు, 19న తర్లుబాడు మండల కేంద్రాల్లో మండల స్థాయి స్పందన జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్



టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

ఒంగోలు(కల్చరల్), జనవరి 4: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని ఆంధ్రా హైస్కూల్‌లో విద్యార్థులకు టైఫాయిడ్ వ్యాక్సినేషన్ శిబిరం జరిగింది. టైఫాయిడ్ రాకుండా ముందుజాగ్రత్త చర్యగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బొమ్మల శ్రీనివాసరావు మాట్లాడుతూ టైఫాయిడ్ అత్యంత ప్రమాదకరమని, వాక్సిన్ వల్ల పిల్లలకు రెండు సంవత్సరాలు రక్షణ లభిస్తుందన్నారు. అదేవిధంగా తమ పాఠశాలలో వ్యాక్సినేషన్ శిబిరం ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ పి.ప్రకాష్ బాబు, కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4: ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోలు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షురాలిగా ఎం.అనిత (ఒంగోలు), ప్రధానకార్యదర్శిగా వి.వెంకటేశ్వర్లు(గిద్దలూరు), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.స్టాలిన్(కందుకూరు), ఉపాధ్యక్షుడుగా పి.శ్రీనివాసరావు(కనిగిరి), కోశాధికారిగా బి.శ్రీనివాస్(కందుకూరు), జిల్లా కో ఆర్డినేటర్‌గా బి.మణికంఠకుమార్ (చీరాల), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ రుక్మిణి(చీరాల), ఎస్‌కే.సమీర్(పర్చూరు), ఎం.పోతురాజు(మార్కాపురం), కె.మహాలక్ష్మి(మార్కాపురం), జాయింట్ సెక్రటరీలుగా ఎస్.శ్రీనివాసరావు, ఎం.శైలజ, టి.రాణి, ఎం.కరుణామయుడు, ఎన్.అపర్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంధ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను అందజేస్తున్న యువకులు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 4: లూయిస్ బ్రెయిలీ పుట్టిన రోజును పురస్కరించుకుని నగరానికి చెందిన తమూ బాలకృష్ణ, అతని స్నేహితుల ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేసి విందు ఏర్పాటు చేశారు. గురువారం ఒంగోలు నగరం కర్నూలురోడ్‌లోని అంధుల పాఠశాలలో జరిగిన లూయిస్ బ్రెయిల్ చిత్రపటానికి వారు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



దామచర్ల పూర్ణచంద్రరావుకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే స్వామి

ఘనంగా పూర్ణచంద్రరావు జన్మదిన వేడుకలు

● శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, జనవరి 4 : మాజీమంత్రి దామచర్ల ఆంజనేయులు కుమారుడు టీడీపీ సీనియర్ నేత పూర్ణచంద్రరావు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు గురువారం వైభవంగా నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఒంగోలులో ఆయన్ను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య, సీనియర్ నేతలు బంగారయ్య, ఈదర ప్రభాకర్ ఉన్నారు. కాగా సింగరాయకొండ సాయిబాబా మందిరంలో టీడీపీ నేతలు కేక్ కట్ చేశారు. పూర్ణచంద్రరావు కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, షేక్ సందానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, గుదే వెంకటేశ్వర్లు, అడుసుమల్లి సుధాకర్, కళ్లగుంట నరసింహ, బచ్చే పాల్గొన్నారు.

కొండపిలో ఘనంగా వేడుకలు

కొండపి : టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా ఒంగోలులోని ఆయన నివాసంలో జరిగాయి. పార్టీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి కొర్రపాటి వసంతరావు పాల్గొని పూర్ణచంద్రరావుకు పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దామా మురళి, నన్నూరి సుబ్బరామయ్య, ముప్పరాజు శ్రీనివాసరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ ఖాజాషా, పార్టీ ఎస్సీసెల్ మండల నాయకుడు కె. మహేంద్ర పాల్గొన్నారు.

ఒంగోలులోని స్వగృహంలో..

టంగుటూరు : జడ్పీటీసీ మాజీ సభ్యుడు, దామచర్ల సత్య తండ్రి పూర్ణచంద్రరావు పుట్టినరోజు వేడుకలను గురువారం ఒంగోలులోని స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి బొకే ఇచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల నాయకులు ఈదర ప్రభాకర్, రామాగోపి, హరిబాబుతోపాటు మండలంలోని పలువురు ముఖ్యనాయకులు పూర్ణచంద్రరావుకు బొకే అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త పెన్షన్ల పంపిణీ 8కి వాయిదా

టంగుటూరు, జనవరి 4 : మండలంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మండలంలో చేపట్టనున్న కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఈ నెల 8కి వాయిదా పడింది. కొత్త పెన్షన్ల పంపిణీ తొలుత ఈ నెల 5న జరుగుతుందని, మంత్రి సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని బుధవారమే ఎంపీడీవో రత్నజ్యోతి ప్రకటించారు. ఇప్పటికే పెన్షన్లు అందుకోవడం ఆలస్యం కావడంతో కొత్తగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులంతా పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో మళ్లీ మూడు రోజులు వాయిదా పడడంతో కొత్త పెన్షన్ల జాబితాల్లోని లబ్ధిదారులంతా నీరసించారు.



ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

కళ్లకు గంతలు కట్టుకొని కార్మికుల నిరసన

చీమకుర్తి, జనవరి 4 : మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం పదో రోజుకు చేరుకుంది. చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో సమీపంలో ధర్నా నిర్వహించారు. తమ పట్ల ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య వైఖరికి కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పూసపాటి వెంకట్రావు, నాగయ్య, కోటేశ్వరరావు, యేహోన్, ఏడుకొండలు, పద్మ, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శివమందిరానికి శంకుస్థాపన

ఒంగోలు (కల్చరల్), జనవరి 4: శ్రీ శంకర బాలభక్త సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరం ఇలింద్రవారి వీధిలో శ్రీ గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి నూతన మందిర శంకుస్థాపన కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ప్రముఖ పురోహితులు రాజేష్ శర్మ యాజ్ఞికంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సామూహిక శివ సహస్రనామం, గీతా పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ట్రస్ట్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

24వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి4: నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె గురువారానికి 24వరోజుకు చేరింది. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సుబ్బరావమ్మ, ప్రమీల, బసవపున్నయ్య, టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

చీమకుర్తి, జనవరి 4 : చీమకుర్తిలోని బాలికల ఉన్నతపాఠశాలలో పదోతరగతి విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండా చినవెంకటేశ్వర్లు, అంబటి వీరారెడ్డి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, ఎంఈవో శివాజీ, హెచ్‌ఎం వీరాస్వామి, దాసరి సుబ్బారావు, నల్లూరి వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 4: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని మహిళాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం సోషల్ వర్క్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హర్షప్రీతందేవ్ కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని ప్రభుత్వ బాలికల వసతిగృహంలో గురువారం నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమానికి జైభీం సంస్థ అధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్నవర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప మహిళ సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. కార్యక్రమంలో వార్డెన్లు స్వప్నలత, శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.

అరాచక పాలనపై ప్రజల్లో తిరుగుబాటు

• 'రా కదలి రా' ను జయప్రదం చేయండి

• ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



కనిగిరిలో ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జనవరి 4: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, అసమర్థ అరాచక రాజకీయంపై సొంత పార్టీ నేతల అసమ్మతి గళం వినిపిస్తున్నారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం తీరుపై ఆపార్టీ ఎమ్మెల్యేలు ఆత్మస్థైర్యం కోల్పోయారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకం, దౌర్జన్యం, దోపిడి తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రజలంతా జనాసుర పాలన అంతమొందించాలని దీక్షబూనారని ఆ యన పేర్కొన్నారు. అరాచక ఉన్మాదపాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. జగన్‌ను నమ్మి మోసపోయామని ఆయన వెంట నడిచిన ఎమ్మెల్యేలే చెప్పడం ఆయన దుష్టపాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక..

ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గుడ్‌బై చెప్తున్నారని ఏలూరి పేర్కొన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీ ఎమ్మెల్యేలు వైసీపీకి గుడ్‌బై చెప్తున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని రాజీనామాలు చేస్తున్నారన్నారు. వైసీపీలో చాలా మంది ఎంపీలు తమ రాజకీయ భవిష్యత్ ఎలా ఉంటుందో వారికే అర్థంకాని పరిస్థితిలో ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి ఐదేళ్ళు వెనక్కిపోయిందన్నారు. ప్రజల నుండి వస్తున్న నిరసన జ్వాలలకు ఆహుతి కాకముందే పార్టీని వీడి ఇతర పార్టీలోకి పోతున్నారని ఏలూరి అన్నారు.

శుక్రవారం కనిగిరిలో జరిగే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపు నిచ్చారు. తెలుగుదేశం పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైసీపీ వలసపక్షిని తరిమికొట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

వైపాలెం ప్రజలను వదిలేసి కొండపికి ఎందుకు వచ్చారో సమాధానం చెప్పాలి

ఒక్కసారి చూడండి అంటున్నారు..

మూడుసార్లు గెలిచి ఏమీ వెలగబెట్టారు

మంత్రి ఆదిమూలపుపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, జనవరి 4 : 'నాలుగున్నరేళ్ల జిల్లాకు మంత్రిగా ఉండి వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయలేకపోయావు, మార్కాపురం జిల్లా సాధించలేకపోయావు, నియోజకవర్గంలో సమస్యలను, అభివృద్ధిని గాలికొదిలేశాం, యర్రగొండపాలెం తండాల్లో ఉన్న గిరిజనలను మోసాం చేశావు.. అక్కడి ప్రజలను ఇక్కట్లకు గురిచేశావు.. కొండల్లో, గుట్టల్లో జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చి మోసం చేశావు.. నీ అనుచరులకు లేఅవుట్ల పేరుతో దోచిపెట్టావు' అని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మంత్రి ఆదిమూలపు సురేష్‌పై నిప్పులు చెరిగారు. స్థానిక పంచాయతీ పరిధిలోని బుంగబావి సెంటర్లో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి వచ్చిన వైసీపీ వలసపక్షిని తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పటికి మూడుసార్లు గెలిచి ఆ నియోజకవర్గాల్లో ఏమి అభివృద్ధి చేశావో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. తనను కాకుండా జగనన్నను చూసి ఓటు వేయాలని కోరారని, రేపు నియోజకవర్గ ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి ఆయన వద్దకూ వెళ్లాలా అని ఎద్దేవా చేశారు. ఇప్పటికి నియోజకవర్గంలో ఆ పార్టీలో తనపై ముగ్గురు పోటీచేసి వెళ్లిపోయారని, నాల్గో వ్యక్తి కొత్తగా వచ్చారని, ఆయన కూడా ఎన్నికలు ఆయన తరువాత తట్ట బుట్ట సర్దేస్తారని తెలిపారు. అనంతరం ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, గుదే వెంకటేశ్వర్లు, సన్నెబోయిన శ్రీనివాసులు, చిగురుపాటి గిరి జనసేన నాయకులు పాల్గొన్నారు.

కందుకూరులో వృద్ధురాలి దారుణహత్య





రక్తపు మడుగులో శేషమ్మ మృతదేహం (ఇన్‌సెట్లో) శేషమ్మ (ఫైల్)

● మూడు రోజుల క్రితం జరిగినట్లు అనుమానాలు

● గొంతులో కత్తిదించి ఘాతుకం

కందుకూరు, జనవరి 4: నెల్లూరు జిల్లా కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంటలో మందలపు శేషమ్మ(70) దారుణహత్యకు గురైంది. మూడురోజుల క్రితం ఆమె హత్యకు గురైనట్లు భావిస్తుండగా గురువారం వెలుగులోకి వచ్చింది. శేషమ్మ ఇంట్లోనే కూరగాయలు కోసుకునే కత్తితో గొంతుకోసి మెడలో బలంగా కత్తి దించి హత్య చేశారు. హత్య చేసిన తర్వాత హంతకులు గొంతులో దించిన కత్తిని అలాగే వదిలేసి బాత్‌రూమ్‌లోకి వెళ్లి చేతులు కడుక్కుని ఇంటి తలుపులు తాళం వేసి దర్జాగా వెళ్లిపోయారు. పోలీసుల కథనం మేరకు, శేషమ్మకు భర్త చనిపోగా కుమారుడు కెనడాలో, కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారు. వ్యవసాయ భూములు చూసుకుంటూ ఆమె గ్రామంలోనే ఒంటరిగా నివసిస్తోంది. జనవరి 1వ తేదీ పొలం వెళ్లి సాయంత్రానికి ఇంటికి వస్తుండగా గ్రామస్థులు ఆమెను చూశారు. ఆ తర్వాత శేషమ్మ కనిపించలేదు. దీంతో ఆదేరోజు సాయంత్రం ఆమె ఇంటికి వచ్చి న వెంటనే హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మరుసటిరోజు నుంచి ఆమె కనిపించనప్పటికీ తలుపు తాళం వేసి ఉండటంతో హైదరాబాద్‌లోని కుమార్తె వద్దకు వెళ్లి ఉంటుందని అంతా భావించారు. అయితే గ్రామంలోని ఆమె సమీప బంధువులు విషయం కనుక్కుందామని రెండురోజులుగా ఆమెకు ఫోన్ చేస్తుంటే సమాధానం లేదు. దీంతో అనుమానం వచ్చి హైదరాబాద్‌లో ఉన్న కుమార్తెకు ఫోన్ చేయగా ఇక్కడికి రాలేదని ఆమె చెప్పారు. ఇంటి కిటికీలు తీసి వెతుకులాడారు. ఇంట్లోనుంచి దుర్వాసన వస్తుండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చి తలుపులు పగులగొట్టగా, బెడ్‌రూమ్‌లో రక్తపుమడుగులో శేషమ్మ మృతదేహం కనిపించింది. అయితే ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలు, చేతికి ఉన్న బంగారం గాజుల జోలికి హంతకులు వెళ్లలేదు. ఇంట్లో ఉన్న నగలు, నగదును కూడా హంతకులు తాకలేదు. దీంతో సీఐ హఫీజ్, రూరల్ ఎస్ఐ తిరుపతిలు పంచనామా పూర్తిచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. చుట్టుగుంటలో ఎన్నడూ ఇలాంటి నేరాలు జరగకపోవటంతో పాటు శేషమ్మ ఎవరితో వివాదాలకు వెళ్లే మనిషి కాకపోవటంతో ఆమె దారుణ హత్యకు గురైందన్న వార్త సంచలనంగా మారింది. హత్య మిస్టరీగా మారటంతో హంతకుడు ఒక్కరా ? లేక ఎక్కువ మంది ఉన్నారా ? అనేది పోలీసులు తేల్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కొండపిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

కొండపి, డిసెంబరు 4 : అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న నిరసన కార్యక్రమం 24వ రోజైన గురువారమూ కొనసాగింది. కొండపిలోని మండల కార్యాలయాల ఎదుట యథాప్రకారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, నిర్మల, పున్నమ్మ, మస్తానమ్మ, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు భోజన సదుపాయం

పొన్నలూరు : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు మద్దతుగా పొన్నలూరు మండల టీడీపీ నాయకులు నిలిచారు. గురువారం మధ్యాహ్నం నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు, ఆయాలకు తెలుగు యువత నాయకుడు గెట్టిబోయిన మల్లికార్జున భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు గమ్మ శ్రీకాంత్‌యాదవ్, నాయకుడు పందేళ్ల మాధవ, మాదాల చంద్ర పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే స్వామి పరామర్శలు

ఎం నిడమలూరు(టంగుటూరు), జనవరి 4 : మండలంలోని ఎం నిడమలూరు, మర్లపాడు గ్రామాల్లోని మృతుల కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పరామర్శించారు. అనారోగ్యం పాలైన వారి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎం నిడమలూరులో ఈ నెల 2న ఆర్‌పీఎఫ్ పోలీస్ తానికొండ రామ్మోహన్ ఆకస్మికంగా చనిపోయాడు. అలాగే స్థానిక ఎస్సీ కాలనీలో పేరాబత్తిన కొండయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఇరువురు మృతుల ఇళ్లకెళ్లి ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. మర్లపాడు మాజీ సర్పంచ్ కొమ్ము రమాదేవి కుమారుడు ఓ ప్రమాదంలో గాయపడడంతో ఎమ్మెల్యే వారింటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్, ఎం నిడమలూరు గ్రామపార్టీ అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్, పార్టీ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిడుగురాళ్ల సురేష్‌బాబు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న అధికారిణి బేబిరాణి

మర్రిపూడి, జనవరి 4 : పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కె.బేబిరాణి సూచించారు. మండలంలోని గుండ్లసముద్రంలో జరిగిన గాలికుంటు వ్యాధి నివారణా కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ నెల 31వ తేదీ వరకు అన్ని గ్రామాలలో గాలికుంటువ్యాధి నివారణా టీకాలు వేయనున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో మర్రిపూడి పశువైద్యాధికారి జె.శ్రావణి, వీఏహెచ్. రాంబాబు, రైతులు పాల్గొన్నారు.





వైసీపీ నాయకత్వానికి మతిభ్రమించింది

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

గిద్దలూరు, జనవరి 4 : వైసీపీ నాయకత్వానికి భ్రమించిందని, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కనిగిరిలో నేడు జరుగనున్న చంద్రబాబు శంఖారావసభకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు ఆయన స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి స్థానిక లక్ష్మీమిల్క్ డెయిరీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలతో ఐదేళ్లు పనిచేయించుకొని, ఇప్పుడు వారికి ప్రజల్లో ఆదరణ లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అభ్యర్థులను ఆ పార్టీ ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇక నేడు టీడీపీ ఆధ్వర్యంలో కనిగిరిలో నిర్వహించనున్న శాంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు. 45 ఏళ్లకే ఫించన్ ఇస్తానని హామీ ఇచ్చి జగన్ మాట తప్పాడని పేర్కొన్నారు. రూ.2వేల కోట్ల అభయహస్తం బీమా డబ్బులను దారి మళ్లించాడని విమర్శించారు. ఆరోగ్యశ్రీ పథకానికి అనారోగ్యం పట్టిందని, సీఎం రిలీఫ్ ఫండ్‌కు అడ్రస్ లేదని అన్నారు. అమ్మఒడిని ఒకరికే పరిమితం చేశారని విమర్శించారు. వెలిగొండకు అధికారహోదా రద్దు కాగా జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు ఢిల్లీ వెళ్లి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గుండ్లకమ్మకు మూడు గేట్లు కొట్టుకుపోతే రిపేరు చేసిన పాపాన పోలేదన్నారు. ఇసుక దోపిడీ కోసమే ఇదంతా చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్కామ్ ఉంటేనే స్కీమ్ పెడుతున్నారని వైసీపీపై ఆరోపించారు. 90శాతం పూర్తయిన 21 లక్షల టిడ్కో గృహాలను ఐదేళ్లుగా ఎవరికీ ఇవ్వకుండా మోసం చేసిన ఘనత జగన్‌దేనన్నారు. మిగులు భూములను కాజేసేందుకే భూసర్వే చేపట్టాడని దుయ్యబట్టారు.

అవసరమైతే నా సీటు ఇస్తా

గిద్దలూరులో సమావేశం జరుగుతున్న సందర్భంలో కొందరు టీడీపీ కార్యకర్తలు ఇక్కడ జనసేనకు టికెట్ ఇస్తారని వైసీపీ శ్రేణులు ప్రచారం చేస్తున్న విషయాన్ని ఉదహరించారు. దీంతో ఎమ్మెల్యే గొట్టిపాటి స్పందిస్తూ అదంతా పార్టీ చూసుకుంటుందన్నారు. దాని గురించి ఎవరూ మాట్లాడాల్సిన పని లేదని పేర్కొన్నారు. అందరం కలిసి ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని, వైసీపీ మాటలు నమ్మవద్దని, అవసరమైతే జనసేనకు నా నియోజకవర్గం ఇస్తానని రవికుమార్ పేర్కొనడం గమనార్హం.

జిల్లా కేంద్రంగా మార్కాపురం: అశోక్‌రెడ్డి

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే పశ్చిమప్రాంత వాసుల చిరకాల స్వప్నం నెరవేరుతుందని, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడనుందన్నారు. అలాగే వెలుగొండ ప్రాజెక్టును కూడా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు మొదటి ఏడాదిలోనే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, పట్టణశాఖ అధ్యక్షులు సయ్యద్ షాన్వావలి, రాచర్లశాఖ అధ్యక్షులు యోగానంద్, టీడీపీ నాయకులు భూపాల్‌రెడ్డి, జీవనేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి నివారణపై అవగాహన

పొదిలి, జనవరి 4 : పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కే.బేబిరాణి సూచించారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో పశు పోషకులకు గాలికుంటు నివారణపై అవగాహన కల్పించారు. చూడి పశువులలో వ్యాధి లక్షణాలు వచ్చే అవకాశం ఎక్కువన్నారు. గాలి కుంటు వ్యాధి కారణంగా గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా కాళ్లగిట్టల మధ్య, నోటిలో పుండ్లు ఏర్పడతాయన్నారు. పశువులలో పాల ఉత్పత్తి సామర్థ్యం తగ్గుతుందన్నారు. చూడిగేదెలు ఈసుకుపోవడం గిట్టల మధ్యలో పుండ్లు ఏర్పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి నివారణకు టీకాలను జనవరి 2 నుండి ఫిబ్రవరి 2వతేదీ వరకు ఉచితంగా అన్ని గ్రామాలలో వేస్తున్నట్లు తెలిపారు. కనుక పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన జంకె


సబ్ కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం రూరల్ జనవరి 4: మాజీ ఎమ్మెల్యే జంకె వెంకట రెడ్డి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాహుల్‌మీనాను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వీరరాఘవరెడ్డిని నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, వైసీపీ నాయకులు పంబి వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

అర్హులకు పింఛన్ మంజూరు చేయరా.?

● చిన్నకంభం సర్పంచ్ ఆగ్రహం

కంభం, జనవరి 4 : కంభంలో మండలంలో అర్హులైన వారికి ఫించన్లు మంజూరు చేయకుండా అధికారులు ఇష్టానురీతిన లబ్ధిదారులను ఎంపిక చేశారని చిన్నకంభం సర్పంచ్ రసూల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కంభం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ నూతన ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన ఫించన్‌దారుల ఎంపిక లోపభూయిష్టంగా ఉందన్నారు. అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసే సమయంలో ఆయా పంచాయతీ పరిధిలోని ప్రజాప్రతినిధులను సంప్రదించాల్సిన అవసరం లేదా..? అని నిలదీశారు. దీంతో తాము తిరకగలేక పోతున్నామన్నారు. చిన్నకంభంలో అర్హులైన వారు పదిమందికి పైగా ఉన్నారని, వీరికి సమాధానం అధికారులు చెబుతారా..? అని ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో ప్రసాద్ స్పందిస్తూ, ఇది మొదటి విడత జాబితా అని, మిగిలిన వారి పేర్లు రెండవ విడతలో వస్తాయన్నారు. ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ మాట్లాడు తూ మండలంలో 112 మందికి నూతనంగా ఫించన్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు కొత్తపల్లి జ్యోతి, సర్పంచ్‌లు బోడయ్య, రజని, మహబూబ్‌పీరా, ఉపసర్పంచ్ ఖాశిం, కోఆప్షన్ మెంబర్ సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పరిశీలన


ట్రాక్ పనులు పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు, జనవరి 4 : నూతనంగా నిర్మించిన రైల్వే డబ్లింగ్ ట్రాక్‌ను రైల్వేశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ, ఇంజనీరింగ్ నిపుణులు మాధవి, పలువురు అధికారులు ప్రత్యేక ట్రాలీలలో గిద్దలూరు నుంచి జేబీ కృష్ణాపురం వరకు కొత్తగా నిర్మించిన ట్రాక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో గుంటూరు నుంచి జేబీ కృష్ణాపురం వరకు రెండవ ట్రాక్ పూర్తి కాగా ప్రస్తుతం జేబీ కృష్ణాపురం నుంచి గిద్దలూరు వరకు నూతనంగా నిర్మించిన ట్రాక్ పూర్తయింది. అధికారుల పర్యవేక్షణ అనంతరం ప్రత్యేక రైలును గిద్దలూరు నుంచి జేబీ కృష్ణాపురం వరకు 125 కిలోమీటర్ల వేగంతో ట్రైల్ రన్ చేశారు. ఎక్కడా ఏ ఇబ్బంది కలగలేదు. దీంతో త్వరలోనే గిద్దలూరు నుంచి గుంటూరు వరకు రెండు లైన్లలో రైళ్లు, గూడ్స్‌లను నడిపేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వంటా-వార్పు

గిద్దలూరు, జనవరి 4 : డిమాండ్ల పరిష్కారం కోసం 10 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు స్థానిక కార్యాలయం ఎదుట రోడ్డుపై వంటవార్పు నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం బెదిరింపు ధోరణులకు పాల్పడుతోందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగయ్య, మురళి విమర్శించారు.



చంద్రబాబు సభకు భారీగా తరలిరండి

మాజీ మంత్రి పుల్లారావు పిలుపు

దర్శి, జనవరి 4 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు శంఖారావం సభకు దర్శి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరావాల్సిందిగా మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు కోరారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు తొలి సభను దిగ్విజయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు గోరంట్ల రవికుమార్, దర్శి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొటుకు రమేష్‌బాబు, దర్శి కురిచేడు, దొనకొండ, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల పార్టీ అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, నెమలయ్య, నాగులపాటి శివకోటేశ్వరరావు, బొమ్మిరెడ్డి ఒబుల్‌రెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి పుల్లారావు, పాపారావు, రవికుమార్

దొనకొండ : శంఖారావం బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గ్రామాల్లో టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించారు.

ముండ్లమూరు : శంఖారావం సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి అభిమానులు తరలి రావాలని కోరుతూ శంకరాపురంలో గురువారం సమావేశం నిర్వహించారు. బ్రహ్మం చౌదరి, మాజీ ఎంపీపీ వెంకటరావు, శ్రీనివాసరావు, సర్పంచ్ నారాయణ స్వామి, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

పామూరు : చంద్రబాబు శంఖారావం సభకు అశేష సంఖ్యలో తరలిరావాలని తెలుగు మహిళ నాయకులుడ పోకా జయమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామంలో మహిళలకు బొట్టుపెట్టి సభకు రావాలని ఆహ్వానించారు. కంభాలదిన్నె గ్రామంలో కూడా మహిళలు ప్రచారం చేపట్టారు.

చంద్రబాబు శంఖారావం సభకు అన్ని గ్రామాల ప్రజలు తరలివెళ్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు తెలిపారు. మండలంలోని తూర్పుకట్టకిందపల్లి, ఎల్ఎన్‌పురం, మోపాడు, ఇనిమెర్ల, నుచ్చుపొద గ్రామ పంచాయతీలలో గురువారం సభను విజయవంతానికి విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో పరిశీలకులు రమనారెడ్డి, మాజీ ఎంపీపీ జీ దశరథరాములు, సయ్యద్ అమీర్‌బాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఇర్రికోటిరెడ్డి, పువ్వాడి వెంకట్‌చౌదరి, మన్నం రమణయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పీసీపల్లి : చంద్రబాబు శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య కోరారు. గురువారం మండలంలోని అన్ని పంచాయతీల్లో పర్యటించారు.

జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి

దొనకొండ, జనవరి 4 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో దర్శి నియోజకవర్గంలో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని జనసేన పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బొటుకు రమేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని రామాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో జనసేనకు జై కొడదాం - తెలుగుదేశానికి తోడుందాం - సుపరిపాలన అందిద్దాం కార్యక్రమాన్ని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గుండాల నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.




జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

ఎమ్మెల్యే ఏలూరి, సత్య

కనిగిరి, జనవరి 4 : రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించి తీరుతామని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, దామచర్ల సత్య అన్నారు. టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు శంఖారావం సభ ఏర్పాట్లను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. చంద్రబాబు తొలి సభ ముందే వైసీపీలో గుబులు మొదలైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రకాశం జిల్లాలోని 12 స్థానాలను టీడీపీ కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, పరిశీలకుడు గోగడి నాగేశ్వరరావు, నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, నారపరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటరెడ్డి, చెంచిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏలూరి, సత్య, ఉగ్ర







వైసీపీలో టికెట్లాట

వైసీపీలో టికెట్లాట.. నియోజక వర్గాల్లో ఓ వెలుగు వెలిగిన నేతల్లోనే అయోమయం.. గందరగోళం నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు రాజకీయ బదిలీ వైరాగ్యం వ్యక్తపరచడం వైసీపీలోని గందరగోళ స్థితికి అద్దం పడుతోంది. సీటు విషయంలో మార్పు ఖాయమనే సంకేతాలను వైసీపీ ఇస్తుండడంతో చాలాచోట్ల వైసీపీ నేతలు కాడి వదిలేశారు. ఎటూ తమ సీటుకు భరోసా లేదు. కనుక ప్రకటించినప్పుడు చూసుకుందామనే ధోరణిలో కొందరున్నారు. తొలి జాబితాలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎనిమిది స్థానాల్లో మార్పు చోటుచేసుకోగా రెండో జాబితాలో ఒకరిని మార్చారు. విడుదల చేసిన జాబితాలో తమ నియోజకవర్గం పేరు లేనందుకు గుంటూరు, పల్నాడు బాపట్ల జిల్లాల నేతలు ఆనందపడడం వైసీపీలో ఉన్న విచిత్ర పరిస్థితికి అద్దం పడుతోంది.

- అధికార పార్టీలో విచిత్ర పరిస్థితి
- ఎమ్మెల్యేల్లో రాజకీయ బదిలీ వైరాగ్యం
- స్థానికంగా కాడి వదిలేసిన నాయకులు
- రెండో గండం గడిచిందని నేతల ఆనందం

బాపట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమీపిస్తున్న వేళ పాలకపార్టీ ఇన్‌చార్జుల జాబితాను విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నెల 2న 27 మందితో వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. సహజంగా జాబితాలో తమను ఖరారు చేస్తూ పేరుండాలనే ఆశతో నేతలు ఉంటారు. తాజాగా వైసీపీ విడుదల చేసిన రెండో జాబితాలో గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు తూర్పు మాత్రమే ఉండగా అక్కడ మార్పు అందరూ ఊహించిందే కావడంతో పెద్దగా ఎవరూ ఆశ్చర్యం వ్యక్తం కాలేదు. కాకపోతే మిగిలిన నియోజకవర్గాల్లో ఉన్న పాలక పార్టీ నేతలు మాత్రం ఈ జాబితాలో తాము ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గం పేరు కనబడనందుకు ఆనందపడుతున్నారు. నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను ఖరారు చేస్తూ జాబితాలు విడుదల చేస్తుంటే తమ నియోజకవర్గం పేరు లేనందుకు ప్రస్తుతానికి గండం గడిచిందని నేతలు వ్యాఖ్యానించడం వైసీపీలో ఉన్న గందరగోళ స్థితికి అద్దం పడుతోంది. ఇప్పటికే సమన్వయకర్తలను ఖరారు చేసిన నియోజకవర్గాలను మినహాయిస్తే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా మార్పులు ఖాయమనే అంచనాలకు సదరు నేతలు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి తమను వేరే నియోజకవర్గానికి మార్చడమన్నా జరగాలి లేదంటే తమకు మొండిచేయి చూపెట్టి వేరే వారిని ఆయా నియోజకవర్గాల్లో నియమించడమం అధికార పార్టీ విధానంగా ఉంది. దీంతో తమ నియోజకవర్గం కానీ, తమ పేరు కానీ జాబితాలో ప్రస్తుతానికి లేకపోవడమే మేలని వైసీపీ నేతలు భావిస్తుండడం అయోమయ స్థితికి అద్దం పడుతోంది. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు ఎక్కువగా కనబడు తున్నాయని, పరిస్థితులను బట్టి అప్పుడు ఏదో ఒక నిర్ణయం తీసుకోవచ్చనేది నేతల ఆలోచనగా ఉంది. అప్పటి వరకు తమ విషయంలో పార్టీ ఏ నిర్ణయం తీసుకోకుండా ఉండడమే మంచిదనే అభిప్రాయాన్ని నేతలు వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

తొలి జాబితాలో పెద్ద సంఖ్యలో...

గతేడాది డిసెంబరు 11న 11 మంది సమన్వయకర్తలతో వైసీపీ తొలి జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ జాబితాలో అనూహ్యంగా గుంటూరు జిల్లాకు సంబంధించి నాలుగు స్థానాలకు సమన్వయకర్తలను ప్రకటించగా, పల్నాడు జిల్లాలో ఒకటి, బాపట్ల జిల్లాలో మూడు స్థానాలకు సమన్వయకర్తలను ప్రకటించారు. తొలిజాబితాలో ప్రకటించిన 11 స్థానాల్లో 8 గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోనే ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని రెండో జాబితాలో కూడా ఈ మూడు జిల్లాల నుంచి భారీ మార్పులుండే అవకాశం ఉందని వైసీపీ నేతలు భావించారు. రెండో జాబితా విడుదలకు ముందునుంచే గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మరో నాలుగు స్థానాలకు సంబంధించి కొత్త ఇన్‌చార్జిలను ప్రకటిస్తారన్న ప్రచారం జోరుగా సాగింది. బాపట్ల జిల్లాలో పర్చూరు స్థానంలో మార్పు ఖాయమనే అభిప్రాయం వైసీపీ వర్గాల్లోనే వ్యక్తమైంది. అయితే రెండో జాబితాలో ఒక్క గుంటూరు తూర్పు తప్ప వేరే వాటిని ప్రకటించకపోవడంతో ప్రస్తుతానికి గండం తప్పిందని నేతలు ఊపిరి పీల్చుకున్నారు.

తొలి జాబితా మంటలు ఇంకా చల్లారలేదు...

వైసీపీ తొలి జాబితా అసంతృప్తి జ్వాలలు ఇంకా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా రగులుతూనే ఉన్నాయి. ముఖ్యంగా రేపల్లెలో ఎంపీ మోపిదేవిని తప్పించడంపై మత్స్యకార సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇంకా వైసీపీ పెద్దలను కలుస్తూనే ఉన్నారు. తాజాగా బుధవారం కూడా పార్టీ పెద్దలను కలిసి రేపల్లె సీటు ఎంపీ మోపిదేవికే కేటాయించాలని వైసీపీ కీలక నేతల దగ్గర మత్స్యకార సంఘ రాష్ట్ర ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఇక అద్దంకిలో అయితే ఇప్పటికీ మాజీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య సీటు తనదేననే ధీమా వ్యక్తం చేస్తూ విడిగా కార్యక్రమాలు చేసుకుంటున్నారు. ఇక గుంటూరు పశ్చిమలో తాజాగా రజిని కార్యాలయంపై రాళ్ల గొడవ వారిలో ఉండే గ్రూపు తగాదాల వల్లే జరిగిందని టీడీపీ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో అక్కడ కూడా కొత్త ఇన్‌చార్జిని స్వాగతించే పరిస్థితులు లేకపోగా విభేదాలు రోజురోజుకు ముదురుతున్న సూచనలు కనబడుతున్నాయి. వేమూరు విషయంలో అయితే వైసీపీ ద్వితీయశ్రేణి నేతలు నూతన ఇన్‌చార్జి అశోక్‌బాబుకు సహకరించేది లేదని తేల్చి చెబుతున్నారు. ఇలా వైసీపీ ప్రకటించిన అన్ని స్థానాల్లో ఏదో ఒక రూపంలో అసమ్మతి భగ్గుమంటూనే ఉంది.

ఇదో వింత పరిస్థితి...

ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు సీటు ఉందో లేదో చెప్పి వేరే వారిని ఆయా స్థానాల్లో ప్రకటించడం దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న వైఖరి. కానీ ప్రస్తుత పాలకపార్టీలో నడుస్తున్న ట్రెండ్ వేరు. రాజకీయ బదిలీలు చేపడుతుండడంపై నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి తాము పాతుకుపోయిన నియోజకవర్గాలను వేరే వారికి కేటాయిస్తూ, తమను కొత్త చోటకు పంపడం ఏమిటో తెలియక తలలు బాదుకుంటున్నారు. దీనిబదులు తమకు సీటు నిరాకరిం చడమే మేలని అలా చేయకుండా వేరే చోటకు పంపించి పొమ్మ నకుండా పొగబెట్టే దుర్మార్గ వ్యూహం ఏమన్నా అధికార పార్టీ అమలు చేస్తుందేమోనన్న అభిప్రాయాన్ని సొంత పార్టీ నేతలే వ్యక్తం చేయడం గమనార్హం. ఏది ఏమైనప్పటికీ వైసీపీలో జరు గుతున్న టికెట్లాట వల్ల జాబితా విడుదల చేసిన ప్రతిసారి గండం గడిచిందని అనుకునే పరిస్థితి సదరు నేతలకు దాపురించిందని ప్రజలు అనుకుంటున్నారు.





పింఛన్లు.. 16.59 శాతమే

- నామమాత్రంగా కూడా కాని పంపిణీ
- అవ్వా.. తాతలకు పంపిణీలో తీవ్రజాప్యం
- వలంటీర్ల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- పింఛన్ కోసం లక్షల మంది ఎదురుచూపు
- 5.57 శాతం పంపిణీతో చిట్టచివరన పల్నాడు జిల్లా

నరసరావుపేట, జనవరి 4: ప్రతీ నెల ఒకటో తేదీ.. ఆ రోజు ఆదివారమైనా.. మరేదైనా సెలవు దినమైనా.. పండుగైనా కూడా సూర్యోదయానికి ముందుగానే చిక్కటి చిరునవ్వుతో వలంటీరు వచ్చి గుడ్‌మార్నింగ్ చెప్పి పింఛన్ ఇస్తారు.. వారి మోములో నవ్వును చూస్తారు.. అని ముఖ్యమంత్రి జగన్ వేదికలపై చెప్తున్నారు.. అదే రీతిలో ప్రచారం కూడా చేసుకుంటున్నారు. అయితే జనవరి నెలలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న సామాజిక పింఛన్ లబ్ధిదారుల్లో నిరాశ నెలకొంది. ఈ నెలలో నాలుగు రోజులు గడిచినా పలువురికి పింఛన్ అందలేదు. ఇప్పటి వరకు నామమాత్రంగా కూడా పింఛన్ల పంపిణీ జరగలేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో గురువారం సాయంత్రం 5 గంటల వరకు 16.59 శాతం మంది లబ్ధిదారులకు మాత్రమే పింఛన్ పంపిణీ చేసినట్లు అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయి. ఉద్యోగులు, ప్రభుత్వ పింఛన్‌దారులకు లాగానే సామాజిక పింఛన్ పంపిణీలో జాప్యం జరుగుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడో రూ.3,000కు పెంచాల్సిన పింఛన్‌ను ఎట్టకేలకు ఎన్నికలకు మూడు నెలల ముందుగా జనవరి నెలలో ప్రభుత్వం పెంచింది. పెరిగిన మొత్తంతో ఈ నెలలో పింఛన్ తీసుకోవచ్చని నాలుగు రోజులుగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. అయితే తమకు ఎప్పటికి పింఛన్ వస్తుందనే విషయంపై అధికారుల నుంచి సరైన సమాధానం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. పింఛన్‌పైనే ఆధారపడి అనేక మంది వృద్ధులు, వితంతువులు జీవనం సాగిస్తున్నారు. మందులు ఇతర ఖర్చులకు ప్రభుత్వం అందజేసే పింఛన్‌ను వినియోగించుకుంటూ ఉంటారు. అయితే నాలుగు రోజులైనా పింఛన్ అందకపోవడం.. ఎప్పుడు అందుతుందో తెలియక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

సమయం పట్టవచ్చు..

వృద్ధాప్య వివిధ రకాల పింఛన్లు పూర్తి స్థాయిలో పంపిణీకి ఇంకా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. మూడు జిల్లాలో 7,86,022 లబ్ధిదారులకు పింఛన్ అందించాలి. అయితే కేవలం 1,30,478 లబ్ధిదారులకు మాత్రమే పింఛన్ పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో పింఛన్ నగదు వలంటీర్లకు అందలేదు. వారి చేతికి ఆ నగదు అందితేనే లబ్ధిదారులకు పంపిణీ చేసే పరిస్థితి. పింఛన్ కోసం వలంటీర్ల చుట్టూ వృద్ధులు ప్రదక్షిణలు చేస్తున్నారు. పింఛన్ పంపిణీలో పల్నాడు జిల్లా చిట్ట చివరిలో ఉంది. ఈ జిల్లాలో 5.57 శాతమే పింఛన్‌లు పంపిణీ చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం అవుతుంది. బాపట్ల జిల్లాలో 23.38 శాతం, గుంటూరు జిల్లాలో 22.42 శాతం మంది లబ్ధిదారులకు మాత్రమే పింఛన్ పంపిణీ చేశారు.

పింఛన్ పంపిణీ వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	స్వీకరణ	శాతం
పల్నాడు	2,85,051	15,886	5.57
బాపట్ల	2,37,394	55,503	23.38
గుంటూరు	2,63,577	59,089	22.42

కోడిగుడ్డుకు.. కోత



- గుడ్డు లేకుండానే జగనన్న గోరుముద్ద
- ధరలు పెరిగాయని పంపిణీ చేయని వైనం
- ప్రశ్నించిన ఉపాధ్యాయులపై రాజకీయ ఒత్తిడి

గుంటూరు(విద్య), జనవరి 4: అమాంతం పెరిగిపోతోన్న కోడి గుడ్డు ధర మధ్యాహ్న భోజనం(జగనన్న గోరుముద్ద)పైనా ప్రభావం చూపుతోంది. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కు కోడిగుడ్డు లేకుండానే మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ధరలు పెరిగాయని ప్రభుత్వ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పంపిణీ చేసే కోడిగుడ్డుకు కోత విధించారు. వందల పాఠశాలల్లో గుడ్డు లేకుండానే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. ధరలు పెరిగాయని కోడిగుడ్లను పాఠశాలలకు సరఫరా చేయడం లేదు. దీంతో విద్యార్థులు వారం నుంచి కోడిగుడ్డు లేకుండానే భోజనం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 4వేలకు పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 3.43 లక్షల మంది విద్యార్థులు ప్రతి రోజు మధ్యాహ్న భోజనం (జగనన్న గోరుముద్ద) చేస్తారని రికార్డులు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ధేశించిన కొత్త మెనూ ప్రకారం వారంలో ఐదు రోజులు ఉడికించిన గుడ్డును భోజనంతోపాటు పంపిణీ చేయాలి. నెల నుంచి కోడిగుడ్ల ధరలు భారీగా పెరిగాయి. హోల్‌సెల్‌లో ఒక్కో గుడ్డు రూ.6.50కు విక్రయిస్తుండగా, రిటైల్ మార్కెట్‌లో రూ.7కు విక్రయిస్తున్నా రు. పెరిగిన ధర ప్రకారం ఏజన్సీ నిర్వహకులు పౌల్ట్రీల నుంచి కోడిగుడ్లు కొనుగోలు చేయడం లేదు. ఫలితంగా పాఠశాలలకు సరఫరా నిలిచిపోవడంతో మధ్యాహ్న భోజనంలో గుడ్డు అందించడం లేదు. ఇదేమని ప్రశ్నించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఏజన్సీ నిర్వహకులు సరైన సమాధానం ఇవ్వడం లేదు. సరికదా గుడ్డు పంపిణీ గురించి ప్రశ్నించవద్దని కొంత మంది ప్రజా ప్రతినిధుల చేత వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో చేసేది లేక కొంతమంది ప్రధానోపాధ్యాయులు మౌనంగా ఉండిపోతుండగా మరికొందరు ఆయా జిల్లాల డీఈవోలకు ఫిర్యాదు చేశారు.

అధికారులను ఖాతరు చేయని ఏజన్సీలు

ప్రభుత్వ పాఠశాలలకు గుడ్డు సరఫరా చేయని ఏజన్సీలను అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇలా చేస్తే బిల్లులు నిలిపి వేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో ఏజన్సీ నిర్వహకులు రాజకీయ ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం గుంటూరు నగరంలోని కొన్ని పాఠశాలలకు గుడ్డు సరఫరా చేయని ఏజన్సీ నిర్వహకుడిపై విద్యాశాఖ ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు పంపిణీదారు నగరానికి చెందిన ఓ ప్రముఖ ప్రజాప్రతినిధి చేత విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే దీనిని విద్యాశాఖ అధికారులు లెక్కచేయలేదు. మీరు ఎవరితో సిఫార్సు చేయించినా ఉపయోగం లేదు.. అవసరం అయితే మేమే వారితో మాట్లాడ తాం.. తక్షణం గుడ్డు సరఫరా చేయకుంటే బిల్లులు నిలిపివేస్తా మని ఏజన్సీ నిర్వాహకుడికి స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో కోడిగుడ్డు పంపిణీపై విద్యాశాఖ అధికారు లు క్షేత్రస్థాయి నుంచి సమాచారం సేకరిస్తున్నారు. ఏ మండ లాల్లో ఏఏ పాఠశాలలకు ఎన్ని రోజుల నుంచి గుడ్లు సరఫరా చేయడం లేదనే విషయాలను ప్రధానోపాధ్యాయుల నుంచి నివేదిక రూపంలో సేకరించారు. ఆ నివేదికను రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడానికి విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు.



నేడు ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ

- చీరాల సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు
- ఐదు ప్రాంతాల నుంచి బస్సులు ఏర్పాటు చేసిన యాజమాన్యం

చీరాల, జనవరి 4: ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన వారు సంయుక్తంగా సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సౌ జన్యంతో ముత్యాల ముగ్గులు పోటీలు శుక్రవారం ఉదయం 9 గంటలకు సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)లో జరుగుతాయి. పోటీలో పాల్గొన దలచిన మహిళలు ఇప్పటికే ఆంధ్రజ్యోతి దినపత్రికలో వస్తున్న ప్రకటనలోని ఫోన్ నెంబర్లకు రిజిస్టర్ చేసుకున్నారు. పోటీలో పాల్గొన్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు అందజేస్తారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నారు. పోటీలకు హాజరయ్యే మహిళలు సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల బస్సులలో రావచ్చు. స్థానిక రైల్వేస్టేషన్, బస్టాండ్ కూడలి, పేరాల కూడలి, నల్లగాంధీబొమ్మ కూడలి, కొత్తపేట కూడలిలో కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సులలో రావచ్చు. పోటీల అనంతరం పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలను తిరిగి బస్టాండ్ వద్ద దింపే ఏర్పాట్లు చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీలో పాల్గొనే మహిళలు అందుకనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్వా హకులు పేర్కొన్నారు. పేర్లు రిజిస్ట్రేషన్‌కు, ఇతర వివరాలకు సెల్ నెంబర్లు 99490 73369, 93903 07829, 9985411491లో సంప్రదించవచ్చు.





కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ఐసీడీఎస్‌కు బడ్జెట్‌కు తగ్గించటం అన్యాయం

● 24వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె

● కొనసాగుతున్న ఆందోళన

ఒంగోలు నగరం, జనవరి 4: డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరింది. యథావిధిగా కార్యకర్తలు, ఆయాలు జిల్లా కేంద్రంలో ప్రకాశం భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలను కొనసాగించారు. ఒంగోలులో ధర్నా కార్యక్రమానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు హేమేమా అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ ధర్నాను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రప్రభుత్వం ఐసీడీఎస్‌కు బడ్జెట్‌ను తగ్గించి వేయటం దుర్మార్గమన్నారు. బడుగు బలహీనవర్గాల తల్లులకు, గర్భవతులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించటంలో ప్రధాన భూమిక పోషిస్తున్న వర్కర్లకు కనీస వేతనాలను అందించటానికి రాష్ట్రప్రభుత్వం వెనకడుగు వేయటం శోచనీయమన్నారు. అంగన్‌వాడీల పట్ల వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తుందనాన్నరు. న్యాయం కోసం గత 24 రోజులుగా మహిళలు రోడ్ల మీదకి వచ్చి ఆందోళన కొనసాగిస్తుంటే రాష్ట్రప్రభుత్వం చోద్యం చూస్తుందని ఆమె విమర్శించారు. కడుపు మండి వర్కర్లు చేస్తున్న ఆందోళనను పట్టించుకోకుండా దున్నపోతు మీద వాన కురిసిన మాదిరిగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆమె విమర్శించారు. రాష్ట్ర తెలుగు మహిళ విభాగం అధ్యక్షురాలు మోజేటి సునీత మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వమన్నారు. ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి తంగిరాల మహేష్, ఉపాధ్యక్షులు ఎస్‌డి.హుస్సేన్, యూనియన్ నాయకులు శ్రీదేవి, పద్మ, శేషమ్మ, మౌలిక, రాజేశ్వరి, కోటేశ్వరి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇంకా పడలే!

● ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4 : కొన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇంకా పడలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు పడాల్సిన ఉంది. కానీ నెల ప్రారంభమై నాలుగు రోజులు గడిచినా ఇంకా 40 శాతం మందికి అందలేదు. కొన్నిశాఖలకు పూర్తిస్థాయిలో జీతాలు పడగా, మరికొన్ని శాఖల్లో కొంతమందికే పడ్డాయి. అయితే ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రం ఎదురుచూపులే మిగిలాయి. జిల్లాలో పదివేల మందికిపైగా ఉపాధ్యాయులు పనిచేస్తుండగా మరో 20వేల మంది వరకు రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 55వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉండగా వారిలో 60శాతం మంది ఉద్యోగులకు మాత్రమే జీతాలు పడ్డాయి. మిగిలిన 40 శాతం మంది ఉద్యోగులకు జీతాలు పడలేదు. ప్రధానంగా ప్రతినెల ఉపాధ్యాయులకు ఇదే పరిస్థితి నెలకొంది. ఇతర శాఖల ఉద్యోగులకు నాలుగైదు తేదీల్లో జీతాలు పడుతున్నా ఉపాధ్యాయుల జీతాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

9 నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

ఒంగోలు(విద్య) :అకడమిక్ క్యాలెండర్ ప్రకారం అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలకు ఈనెల 9 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్ సుబ్బారావు తెలిపారు పది రోజుల సెలవుల అనంతరం ఈ నెల 19న పాఠశాలల పునఃప్రారంభం అవుతాయని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4 : రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఒంగోలులోని డీఆర్‌ఆర్సీభవన్‌లో ఆత్మ ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ విస్తరణాధికారులు, సాంకేతిక సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయిలో పనిచేస్తున్న ప్రతి ఒక్క వ్యవసాయ సిబ్బంది వారి పరిధిలోని రైతుకు సంబంధించిన వ్యవసాయ అకౌంట్ కలిగి ఉండాలన్నారు అలా చేసినప్పుడే వారికి ఆదాయ, వ్యయ వివరాలు తెలుసుకోవడంతో పాటు వారి ఆర్థిక స్థాయి పెంచేందుకు సరైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటుకు సహకరించాలన్నారు. శిక్షణలో అన్ని అంశాలను తెలుసుకొని క్షేత్రస్థాయిలో వినియోగించాలని సూచించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు ఎస్.శ్రీనివాసరావు, వెంకటరమణ, సుధాకరరాజు, ఎన్.గోపీచంద్, సుజయ్‌కుమార్, కేవీఎస్.ఉపేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యఆరోగ్యశాఖలో నియామకాలపై విచారణ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4 : జిల్లా వైద్యఆరోగ్యశాఖలో 2020 ఏడాదిలో జరిగిన ఉద్యోగ నియామకాలపై వైద్యశాఖ ఆర్‌డీ డాక్టర్ శోభారాణి విచారణ చేపట్టారు. రిక్రూట్‌మెంట్‌లో భారీ అక్రమాలు జరిగాయని కడప జిల్లాకు చెందిన నారపరెడ్డి అనే వ్యక్తి వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌డి శోభారాణి గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖలో విచారణ చేపట్టారు. వైద్యఆరోగ్యశాఖలో అప్పటి ఉద్యోగ నియామకాలపై కలెక్టర్ దినేష్‌కుమార్ సమగ్ర విచారణకు ఆదేశించారని ఆర్‌డీ దృష్టికి తీసుకెళ్ళారు. ఆ నియామకాలపై జడ్పీ సీఈవో జాలిరెడ్డి 40 రోజుల పాటు విచారణ చేశారని, నివేదికను కలెక్టర్‌కు ఇచ్చిన వెంటనే అక్రమాలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటామని ఆర్‌డీ దృష్టికి తీసుకెళ్ళినట్లు సమాచారం. వాసంతి అనే ఉద్యోగి తొలగింపునకు సంబంధించి ఆ ఉద్యోగి రాతపూర్వకంగా ఇచ్చిన అర్జీలను ఆర్‌డీఈకి అందించారు. సమగ్ర విచారణ వచ్చాకే సంబంధితులపై చర్యలు తీసుకుంటామని వైద్యశాఖ అధికారులు చెప్పినట్లు తెలిసింది.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4 : యువత బాధ్యతగా కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని వేదిక అధ్యక్షుడు మాగులూరి నాగేశ్వరరావు కోరారు. సుపరిపాలన వేదిక, ఎన్నికల నిఘా వేదిక ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని ఆంధ్రకేసరి విద్యాకేంద్రం డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రానున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కంచర్ల సుబ్బారావు, డాక్టర్ షాకిర్, ఎంవీ.శేషయ్య, సుంకర సాయిబాబా, చక్కా రంగనాథం, నాగభూషణం, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, లెక్చరర్ విజయలక్ష్మి, దండే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రేపు జూనియర్ బాలుర హాకీ జట్ల ఎంపికలు

సంతనూతలపాడు, జనవరి 4: జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న శనివారం జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపికలు జరుగనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ.రమణారెడ్డి, ఎ.సుందరరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధృవీకరణపత్రం తీసుకుని ఈనెల 6న ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ వద్దనున్న డీఆర్‌ఆర్‌ఎంఎం హైస్కూల్ క్రీడామైదానం వద్దకు రావాలని తెలిపారు. 1-1-2005 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికైన క్రీ డా కారులు ఈనెల 9, 10, 11, 12 తేదీల్లో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీ ల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని, వివరాలకు 7569872979 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడే సమర శంఖారావం

పూరించనున్న చంద్రబాబు

కనిగిరి సభకు సకల ఏర్పాట్లు

వెలిగొండ సాధన ప్రాంగణంగా నామకరణం

భారీఎత్తున తరలిరానున్న టీడీపీ నాయకులు, శ్రేణులు

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల వేడి రాజుకుంటోంది. అందులోభాగంగా మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించేందుకు కనిగిరిలో తొలి ఎన్నికల సభకు నాంది పలుకనున్నారు. నేడు (శుక్రవారం) కనిగిరి - సీఎస్‌పురం రోడ్డులో కనిగిరి పట్టణానికి అతి సమీపంలో సభావేదిక వద్దకు సాయంత్రం 3 గంటలకు చంద్రబాబు చేరుకోనున్నారు. అందుకోసం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర అన్ని సకల ఏర్పాట్లను పూర్తి చేశారు.



కనిగిరిలో టీడీపీ శంఖారావం సభ ఏర్పాట్లను పరిశీలిస్తూ సూచనలు ఇస్తున్న ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి, సత్య

కనిగిరి, జనవరి 4 :వెలిగొండ సాధన ప్రాంగణంగా నామకరణం చేశారు. సభాప్రాంగణాన్ని గత నాలుగు రోజులుగా అనుకూలంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే సభావేదిక సిద్ధం కాగా ప్రాంగణంలో అన్ని హంగుల ఏర్పాటుకు ఉగ్ర ఆధ్వర్యంలో పనులు పూర్తి కానున్నాయి. జిల్లాలోని టీడీపీ ఇన్‌చార్జిలు, ముఖ్యనేతల పర్యవేక్షణలో చంద్రబాబు బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లను చేపట్టారు. ఫొటో గ్యాలరీలతో పాటు వీఐపీ గ్యాలరీలను, మహిళా గ్యాలరీలను సిద్ధం చేశారు. ఫ్లడ్‌లైట్ల కాంతితో సభా వేదిక ప్రత్యేక ఆకర్షణగా సిద్ధం చేశారు. చంద్రబాబు కనిగిరి రానుండడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఏఎస్పీ శ్రీధర్‌రావు డీఎస్పీ రామరాజుతోపాటు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు మాధవరావు పోలీసు సిబ్బందితో కలసి సభాప్రాంగణాన్ని పరిశీలించారు. సభాప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు ఏఎస్పీ తెలిపారు. అదేవిధంగా చంద్రబాబు ప్రత్యేక విమానంలో సభావేదిక వద్దకు రానుండడంతో హెలిప్యాడ్ ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలించారు. సభ ఏర్పాట్లు, చంద్రబాబు షెడ్యూల్, ముఖ్యుల కలయిక వంటి వివరాలపై ఉగ్రతో వారు చర్చించారు. గురువారం టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, దామచర్ల సత్య సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కనిగిరి క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, గుదే రమణయ్య, గంగవరపు నాగిరెడ్డి, సిద్దాటపు వెంకటరెడ్డి, సైకం మాలకొండారెడ్డి, న్యాయవాది మహ్మద్ వలి, వడ్డెంపూడి శ్రీనివాసులురెడ్డి, రోషన్ సంధాని, షరీఫ్, గుడిపాటి ఖాదర్, గారపాటి రమణయ్య, బాలు ఓబులు రెడ్డి, గంజికుంట శ్రీనివాసులు పాల్గొన్నారు.

కనిగిరివైపు కదులుతున్న జనం

● బాబు సభకు భారీ ఏర్పాట్లు

● కనిగిరిలో ఐదు గ్యారెంటీలపై విస్తృత చర్చ

● అధినేత స్పందనపై నమ్మకం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కనిగిరిలో శుక్రవారం సాయంత్రం చంద్రబాబునాయుడు పాల్గొంటున్న బహిరంగసభకు భారీ ఏర్పాట్లు జరిగాయి. వెలిగొండ ప్రాజెక్టు సాధన ప్రాంగణంగా పేరు పెట్టడంలోనే పశ్చిమప్రాంత ప్రజల్లో మంచి స్పందన వచ్చింది. దీనికి తోడు కనిగిరి నియోజకవర్గ అభివృద్ధిపై ఉగ్రనరసింహారెడ్డి ప్రకటించిన ఐదు గ్యారంటీలపై కూడా విస్తృత చర్చ జరుగుతోంది. వీటన్నిటికీ తోడు ఒంగోలు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు కదిలి విస్తృత ప్రచారం చేపట్టడంతో ప్రజల్లో మంచిస్పందన కనిపిస్తోంది. తదనుగుణంగా శుక్రవారం సాయంత్రం కనిగిరి నుంచి వెలిగండ్ల వెళ్లేమార్గంలో కొత్తూరు ప్రాంతంలో ఏర్పాటుచేసిన బహిరంగసభకు భారీగా ప్రజలు తరలిరానున్నారు. ఇప్పటికే తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి ఎన్నికల రంగంలోకి దిగాయి. దీంతో జనసేన నాయకులను కూడా ఈ సభకు ఆహ్వానించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల నుంచి జనసేన కేడర్ కూడా సభకు రానున్నారు. కనిగిరిలో ఉగ్రతో పాటు ఎమ్మెల్యే ఏలూరి, నాయకులు దామచర్ల సత్య తదితరులు మకాం వేసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ముందుగా సభకు వచ్చే ప్రజలకు అన్ని ఏర్పాట్లు చేశారు. రాత్రి సభానంతరం కూడా భోజనం వసతి కల్పించారు. లక్షమందికిపైగా పట్టే ఆవరణలో సభ ఏర్పాటు చేయటమే గాక సమీపంలోనే హెలిప్యాడ్‌ను అక్కడే భోజన ఏర్పాట్లు కూడా ఉండే విధంగా 30ఎకరాల స్థలంలో సర్వం సిద్ధమయ్యాయి. వెలిగొండ ప్రాజెక్టు సాధన ప్రాంగణం పేరు పెట్టడం ద్వారా చంద్రబాబు ప్రాజెక్టు విషయంలో భవిష్యత్తుపై మంచి ప్రకటన చేయవచ్చని భావిస్తున్నారు. అలాగే మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశం కూడా ప్రస్తావించవచ్చని భావిస్తున్నారు. కనిగిరికి సంబంధించి వెలిగొండ ప్రాజెక్టుతో పాటు నిమ్జ్, ట్రిపుల్ ఐటీ నిర్మాణం, సమ్మర్‌స్టోరేజి ద్వారా ఇంటింటికి తాగునీరు ఇచ్చే పథకం, నడికుడి- శ్రీకాళహస్తి రైలు మార్గం పూర్తి అనే ఐదు గ్యారెంటీలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లవచ్చని, తద్వారా ఆయన నుంచి హామీ రావచ్చన్న ఆశాభావం నియోజకవర్గ ప్రజల్లో వ్యక్తమవుతోంది. తదనుగుణంగా ఆ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరాబోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కాగా రాత్రికి అక్కడే బసచేసే చంద్రబాబు శుక్రవారం ఉదయం ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో సమీక్ష నిర్వహించనున్నారు. డాక్టరు ఉగ్ర నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌ను సందర్శించనున్నారు.

తొలి కార్యక్రమంలోనే మంత్రికి షాక్

కొండపి నియోజకవర్గ వైసీపీలో మళ్లీ భగ్గుమన్న వర్గ విభేదాలు

మంత్రి ఆదిమూలపు చేతుల మీదుగా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

వేదికపైకి ఆహ్వానించకపోవడంతో అలిగి వెళ్లిన డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి

మంత్రి కొత్తగా వచ్చి తగాదాలు పెడతారా అంటూ ఆయన వర్గీయుల ఆగ్రహం

రాయభారం నడిపేందుకు సీఐ రంగనాథ్ ప్రయత్నం



ఎంపీడీవో కార్యాలయం నుంచి వెళ్లిపోతున్న డాక్టర్ అశోక్‌రెడ్డి వర్గీయులు

సింగరాయకొండ, జనవరి 4 : కొండపి నియోజకవర్గానికి కొత్త ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు తొలి అధికారిక కార్యక్రమమే షాక్ ఇచ్చింది. ఆయన నిర్వహించిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం రసాభాసాగా మారింది. వైసీపీలో ఉన్న వర్గవిభేదాలు మంత్రి సాక్షిగా మరోసారి బహిర్గతం కావడం చర్చనీయాంశమైంది. హంగూఆర్భాటంతో ఏర్పాట్లు చేసినప్పటికీ నేతల మధ్య వైరాలు మంత్రి సురేష్‌కు తలనొప్పిని తెచ్చిపెట్టింది. వివరాల్లోకెళ్తే... సింగరాయకొండ మండలానికి కొత్తగా మంజూరైన పింఛన్లను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి సురేష్ చేత పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం అట్టహాసంగా ఏర్పాట్లు చేసింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో భారీ సభా వేదికను ఏర్పాటు చేశారు. సభ ప్రారంభంకాగానే వేదికమీదకు వైసీపీ వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డిని ఎంపీడీవో షేక్ జమీవుల్లా ఆహ్వానించలేదు. దీనిని అవమానంగా భావించిన అతను వెంటనే వెనుదిరిగి వెళ్లిపోయారు. దీంతో అశోక్‌కుమార్ రెడ్డి వర్గీయులు మంత్రి, ఎంపీడీవో తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అనుబంధ విభాగాలలో ఒకటైన డాక్టర్ సెల్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తిని వేదిక మీదకు ఆహ్వానించరా.. మంత్రిగా ఉన్న వ్యక్తికి ప్రొటోకాల్ తెలియదా అని ఆగ్రహంతో ఊగిపోయారు. మంత్రి హోదాలో ఉండి తగాదాలు పెట్టడానికి ఇక్కడకు వచ్చారా అని రెచ్చిపోయారు. అశోక్‌కుమార్‌రెడ్డిని వెనక్కి తీసుకురావడం కోసం సీఐ రంగనాథ్ రాయభారం నడిపేందుకు ఆయన వద్దకెళ్లారు. అప్పటికే ఊళ్లపాలెంలో ఓ కార్యక్రమంలో పాల్గొనటానికి ఆయన వెళ్లారు. దాదాపు గంటసేపు అశోక్‌కుమార్‌రెడ్డి ఇంటి వద్దే సీఐ వేచిఉన్నారు. అప్పటికీ ఆయన రాకపోవడంతో చేసేది ఏమీ లేక సీఐ అక్కడ నుంచి వెనుదిరిగి ఎంపీడీవో కార్యాలయం వద్దకు తిరిగి వచ్చేశారు.

ఆహ్వానం పలికేందుకు జాతీయ రహదారిపైకి..

జాతీయ రహదారిపై నుంచి సింగరాయకొండ ట్రంక్‌రోడ్డు మీదుగా మంత్రి సురేష్ కాన్వాయ్ ఎంపీడీవో కార్యాలయం చేరుకుంటుందని భావించి డాక్టర్ శివరామిరెడ్డి ఆసుపత్రి ఎదుట అశోక్‌కుమార్‌రెడ్డి ఆయన వర్గీయులు స్వాగతం పలకటానికి సిద్ధంగా ఉన్నారు. ఈ తరుణంలో మంత్రి కాన్వాయ్ మధ్యలో ఆగదని సమాచారం రావడంతో డాక్టర్ తన వర్గీయులతో కలిసి జాతీయరహదారి వద్ద స్వాగతం పలకటానికి వెళ్లారు. అక్కడ మంత్రి తన కారును అలా నిలిపి నేరుగా ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ వైసీపీలో ఉన్న మరోవర్గం నేత ఆ పార్టీ మండల కన్వీనర్ సామంతుల రవికుమార్‌రెడ్డి తన అనుచరులతో కలిసి మంత్రికి ఘనంగా స్వాగతం పలికి సభావేదిక వద్దకు తీసుకెళ్లారు. దీతో అశోక్‌కుమార్‌రెడ్డి పక్కనే తటస్థంగా నిలబడిపోయారు. అనంతరం సభా వేదికమీదకు పార్టీ పదవుల్లో ఉన్న నాయకులను వైసీపీ టౌన్‌పార్టీ అధ్యక్షుడిని పిలిచారు. అప్పటికీ అశోక్‌కుమార్‌రెడ్డిని ఎంపీడీవో ఆహ్వానించలేదు. దీంతో వేదిక వద్దకు ఆయన వర్గీయులు వచ్చి రాష్ట్ర హోదాలో ఉన్న వ్యక్తిని పిలవరా అని ఎంపీడీవోని ప్రశ్నించారు. అప్పుడు ఆయన అశోక్‌కుమార్‌రెడ్డిని ఆహ్వానించగా అప్పటికే అయన అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇదిలా ఉంటే మంత్రి సురేష్ తిరుగు ప్రయాణంలో కూడా డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డిని పట్టించుకోకపోవడాన్ని అవమానభారంగా భావించారు.



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పాదాభివందనాలు చేస్తున్నా.. ఒక్కసారి ఆదరించండి..!

మంత్రి ఆదిమూలపు సురేష్

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ తాను ఎర్రగొండపాలెం, సంతనూతలపాడులో పోటీచేసి గెలుపొందానని, మూడోసారి కొండపి నియోజకవర్గానికి జగనన్న పంపించారని చెప్పారు. ప్రతి ఒక్కరికీ పాదాభివందనాలు చేస్తున్నా ఒక్కసారి అవకాశం ఇవ్వండని అభ్యర్థించారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. తొలుత వైసీపీ నాయకులు మాట్లాడే సమయంలో అధికభాగం మంత్రి వేదికపై కునుకు తీయడం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్, తహసీల్దార్ ఉష, ఎంపీపీ కట్టా శోభారాణి, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణమ్మ, సర్పంచ్ తాటిపర్తి వనజ, మండల వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కందుకూరులో వృద్ధురాలి దారుణహత్య

● మూడు రోజుల క్రితం జరిగినట్లు అనుమానాలు

● గొంతులో కత్తిదించి ఘాతుకం





రక్తపు మడుగులో శేషమ్మ మృతదేహం (ఇన్‌సెట్లో) శేషమ్మ (ఫైల్)

కందుకూరు, జనవరి 4: నెల్లూరు జిల్లా కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంటలో మందలపు శేషమ్మ(70) దారుణహత్యకు గురైంది. మూడురోజుల క్రితం ఆమె హత్యకు గురైనట్లు భావిస్తుండగా గురువారం వెలుగులోకి వచ్చింది. శేషమ్మ ఇంట్లోనే కూరగాయలు కోసుకునే కత్తితో గొంతుకోసి మెడలో బలంగా కత్తి దించి హత్య చేశారు. హత్య చేసిన తర్వాత హంతకులు గొంతులో దించిన కత్తిని అలాగే వదిలేసి బాత్‌రూమ్‌లోకి వెళ్లి చేతులు కడుక్కుని ఇంటి తలుపులు తాళం వేసి దర్జాగా వెళ్లిపోయారు. పోలీసుల కథనం మేరకు, శేషమ్మకు భర్త చనిపోగా కుమారుడు కెనడాలో, కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారు. వ్యవసాయ భూములు చూసుకుంటూ ఆమె గ్రామంలోనే ఒంటరిగా నివసిస్తోంది. జనవరి 1వ తేదీ పొలం వెళ్లి సాయంత్రానికి ఇంటికి వస్తుండగా గ్రామస్థులు ఆమెను చూశారు. ఆ తర్వాత శేషమ్మ కనిపించలేదు. దీంతో అదేరోజు సాయంత్రం ఆమె ఇంటికి వచ్చిన వెంటనే హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మరుసటిరోజు నుంచి ఆమె కనిపించనప్పటికీ తలుపు తాళం వేసి ఉండటంతో హైదరాబాద్‌లోని కుమార్తె వద్దకు వెళ్లి ఉంటుందని అంతా భావించారు. అయితే గ్రామంలోని ఆమె సమీప బంధువులు విషయం కనుక్కుందామని రెండురోజులుగా ఆమెకు ఫోన్ చేస్తుంటే సమాధానం లేదు. దీంతో అనుమానం వచ్చి హైదరాబాద్‌లో ఉన్న కుమార్తెకు ఫోన్ చేయగా ఇక్కడికి రాలేదని ఆమె చెప్పారు. ఇంటి కిటికీలు తీసి వెతుకులాడారు. ఇంట్లోనుంచి దుర్వాసన వస్తుండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చి తలుపులు పగులగొట్టగా, బెడ్‌రూమ్‌లో రక్తపు మడుగులో శేషమ్మ మృతదేహం కనిపించింది. అయితే ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలు, చేతికి ఉన్న బంగారం గాజుల జోలికి హంతకులు వెళ్లలేదు. ఇంట్లో ఉన్న నగలు, నగదును కూడా హంతకులు తాకలేదు. దీంతో సీఐ హఫీజ్, రూరల్ ఎస్ఐ తిరుపతిలు పంచనామా పూర్తిచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. చుట్టుగుంటలో ఎన్నడూ ఇలాంటి నేరాలు జరగకపోవటంతో పాటు శేషమ్మ ఎవరితో వివాదాలకు వెళ్లే మనిషి కాకపోవటంతో ఆమె దారుణ హత్యకు గురైందన్న వార్త సంచలనంగా మారింది. హత్య మిస్టరీగా మారటంతో హంతకుడు ఒక్కరా ? లేక ఎక్కువమంది ఉన్నారా ? అనేది పోలీసులు తేల్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బీజేపీ పాలనలో దుర్భరంగా మైనార్టీల జీవితాలు

ఒంగోలు(విద్య), జనవరి 4: బీజేపీ పాలనలో దేశంలోని మైనార్టీల వర్గాల జీవితాలు మరింత దుర్భరంగా మారాయని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సయ్యద్ అఫ్సర్ ధ్వజ మెత్తారు. ఒంగోలులోని మల్ల య్యలింగం భవన్‌లో గురువారం జరిగిన ఇన్సాఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఎస్‌డీ.సర్దార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అఫ్సర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనార్టీల పట్ల చిన్న చూపు చూస్తుందని, గతంలో మైనార్టీల విద్యకు రూ.160 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది కేవలం రూ.10 కోట్లు కేటాయించారని ఆరోపించారు. వక్ఫ్ బోర్డును రద్దు ప్రకటనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం హక్కులను కాలరాస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో సయ్యద్‌యాసిన్, సిలార్, ఎస్‌డీ.మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల మనోభావాలు దెబ్బతీయడం తగదు

● సమగ్ర శిక్ష జేఏసీ నాయకుల ధ్వజం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 4: సమగ్రశిక్ష ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్య వహరిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు హెచ్చరించారు. జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదట చేట్టిన దీక్షలు 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు హరిబాబు మాట్లా డుతూ స్టేట్ ప్రాజెక్టు అధికారి ఏర్పాటు చేసిన వెబ్ ఎక్స్ సమావేశంలో కేజీబీవీ మహిళా ఉద్యో గుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వారికి జరిగిన అవమానా న్ని రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ జరిగి నట్లు భావించి రాష్ట్ర ప్రాజెక్టు అధికారి తన మాటలను వెనుక్కు తీసుకోవడంతో పాటు బేషరతు గా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం చేపట్టిన రాష్ట్ర ఎస్పీడి కార్యాలయ ముట్టడిలో సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయా లని కోరారు. స్కూలు అసిస్టెంట్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నక్కా శరత్‌బాబు సంఘీభావం తెలి పారు. నాగులుప్పలపాడు ఎంఈవోలు ఈవీ.రమణయ్య, టి.రవిబాబు రూ.5వేలు ఆర్థిక సహాయా న్ని అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి కల్యాణి పాల్గొన్నారు.



నిరసన దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

ఆరుతడుల కోసం ఎదురుచూపులు


కారంచేడు ప్రాంతంలో నీరులేక బెట్టకు వస్తున్న వరి పైరు

- నీరులేక బెట్టకు వస్తున్న పైర్లు
- గింజలు తాలుగా మారతాయని రైతుల ఆందోళన

కారంచేడు(పర్చూరు), జనవరి 4: అతివృష్టి, అనావృష్టితో అన్నదాతల పరస్థితి అగమ్య గోచరంగా తయారైంది. నిన్నామొన్నటి వరకు తుఫాన్ ప్రభావంతో వచ్చిన వరదలతో నీటి మునిగిన వరి పొలాలు నేడు నీరులేక బెట్టకు వచ్చిన పరిస్థితులు నెలకొన్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నా ఫలితం లేకపోవటంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. కొమ్మమూరు కాలువపైనే ఆధారపడిన రైతులకు ప్రభుత్వ వైఖరి కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. మరోపక్క కొమ్మమూరు కాలవలో నీరు అడుగంటంతో ఏమిచేయాలో పాలుపోనిస్థితిలో రైతులు ఉన్నారు. ఇప్పటికే తుఫాన్ ప్రభావంతో మెట్ట పొలాల్లో సాగుచేసుకున్న పంటలు పూర్తిగా నష్టపోయి అవస్థలు పడుతున్న తరుణంలో ఇలా అరాకొరా సాగుచేసుకున్న మాగాణి పంటలను కూడా నష్టపోవాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పంటలు ఎండిపోతున్నాయి.. ఆరుతడులకు నీరు అందించండి అని మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. మరోప్రక్క డ్యాంలో నీరులేదని ఆరుతడులకు నీరు అందించలేమని అధికారులు కూడా ప్రకటనలు చేసిన నేపథ్యంలో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం పైరు పొలదశకు చేరుకుందని, ఆరుతడులు అందించపోతే గింజ తాలుగా మారుతుందని రైతులు వాపోతున్నారు.

పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లో దాదాపు 16వేల ఎకరాల్లో రైతులు వరిని సాగుచేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.50వేల వరకు ఖర్చుచేశారు. పంట చేతికి అందివస్తున్న తరుణంలో ఆరుతడులు అందకపోతే పూర్తిస్థాయిలో నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పులిచింతల నుంచి ఆరుతడులకు నీరు అందించి ఆదుకోవాలని అన్నదాతలు మొరపెట్టుకుంటున్నారు. ఆదిశగా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి


ఫోన్‌లో సంఘీభావం తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

చినగంజాం, జనవరి 4: కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్‌లో ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని మండల పరిధిలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో సమగ్ర శిక్ష ఉద్యోగులైన సీఆర్ఎంటీలు, కేజీబీవీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఐఈఆర్‌టీలను రెగ్యులర్ చేయాలని కోరుతూ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం సమ్మెలో పాల్గొన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్‌లో ఉన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చి ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగుస్తున్నా ఇంతవరకు పట్టించుకోలేదని మండల పరిధిలోని సీఆర్ఎంటీలు తెలిపారు. సమ్మెకు సీఐటీయూ నాయకులు, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎంఈవోలు సంఘీభావం తెలియజేశారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఉపాధ్యాయుడు ఎస్.నాగమల్లేశ్వరరావుకు ఫోన్ ద్వారా సంఘీభావం తెలిపి మీ వెన్నంటి ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిధిలోని ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సపొందాలి

అద్దంకిటౌన్, జనవరి 4: కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే అంత ప్రమాదకరం ఏమికాదని హెచ్‌సీజీ కేన్సర్ సెంటర్ వైద్య నిపుణులు డాక్టర్ నారు రమణారెడ్డి అన్నారు. గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, హెచ్‌సీజీ ఎంఎన్ఆర్ కేన్సర్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గీతా మం దిర్‌లో ఉచిత కేన్సర్ శిబిరం, అవగాహన సదస్సు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మలాది శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు.

భాస్కర్ సప్లయర్స్ యజమాని గార్లపాటి శ్రీనివాసరావు సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ రమణారెడ్డి పలువురిని పరీక్షించి మందులు అందించడంతో పాటు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణారెడ్డిని, దాత గార్లపాటి శ్రీనివాసరావును రోటరీ క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి, అద్దంకి లేవిప్రసాద్, డాక్టర్ యు.దేవపాలన, సందిరెడ్డి శ్రీనివా సరావు, నర్రా శ్రీలక్ష్మి, నరసింహరావు, మహమ్మద్ రఫీ, జ్యోతి చంద్రమౌళి, రామకోటేశ్వరరావు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రాచపూడిలో దొంగతనం

- 15 సవర్ల నగలు, రూ.1.30 లక్షలు నగదు అపహరణ


రాచపూడిలో దొంగతనం జరిగిన ఇంటి యజమాని సాంబయ్యతో మాట్లాడుతున్న కొరిశపాడు ఎస్ఐ జీవీ చౌదరి

మేదరమెట్ల , జనవరి 4: ఇంటికి తాళాలు వేసి పొలం వెళ్ళి వచ్చిన గంట వ్యవధిలోనే తలుపులు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. గురువారం రాచపూడికి చెందిన రాచపూడి సాంబయ్య 10.30 గంటలకు పొలం వెళ్ళి 11.30 ఇంటికి వచ్చే సరికే తలుపులు పగులగొట్టారు. ఇంటి చుట్టూ నాలుగు సీసీ కెమెరాలు బిగించి ఉన్నాయి. దొంగలు తెలివిగా సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌ను తీసుకువెళ్లారు. కాంపౌండ్ వాలు దూకి ఇంటి ప్రధాన ద్వారం పగులగొట్టి బీరువా తెరిచి అందులో ఉన్న గాజులు, నల్లపూసలు, సుమారు 15 సవర్ల బంగారం, రూ.1.30 లక్షల నగదు తీసుకువెళ్ళారు. రావినూతల బ్యాంక్ లాకర్‌లో బంగారాన్ని సాంబయ్య బుధవారం ఇంటికి తెచ్చాడు. సాంబయ్య భార్య 9.30 గంటలకు పొలం వెళ్లడం, తరువాత సాంబయ్య పొలం వెళ్లడం గమనించి దొంగతనానికి పాల్పడ్డారు. పట్టపగలు దొంగతనం జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

దొంగతనం సమాచారాన్ని కొరిశపాడు స్టేషన్‌కు తెలియపరచడంతో ఎస్ఐ జీవీ చౌదరి సంఘటన స్థలానికి చేరుకొన్నారు. సాంబయ్యతో మాట్లాడి పరి సరాలను పరిశీలించారు. ఇన్‌చార్జ్ సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. డాగ్‌స్క్వాడ్, క్లూజ్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్ల ఉద్యోగోన్నతుల సమస్యను పరిష్కరించాలి

ఒంగోలు(విద్య), జనవరి 4: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న టీచర్ల ఉద్యోగోన్నతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ ప్రతినిధి బృందం డీఈవో వీఎస్ సుబ్బారావును విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న టీచర్ల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ యూటీఎఫ్ నాయకులు గురువారం ఒంగోలులో డీఈవోను కలిసి మాట్లాడారు.

స్పాట్ వాల్యువేషన్ బకాయిలు వెంటనే చెల్లించాలని, డివిజన్ కేంద్రాల్లో కోర్సులు నిర్వహించి సర్వీసు రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చి యాంటిసిడెంట్ రిపోర్టులు ప్రకటించాలని, ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ టీచర్ల పీఎఫ్ ఖాతాలు ప్రారంభించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులతో బదిలీలైన టీచర్ల జీతాల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఓవీ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు, ఎస్.రవి, సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై, కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీలో ఎన్నికల బదిలీలపై కసరత్తు

- సిబ్బంది నుంచి ఆప్షన్స్ తీసుకున్న అధికారులు

ఒంగోలు(క్రైం), జనవరి 4: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీ ప్రక్రియకు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు చెందిన ఎస్ఈబీ సిబ్బంది వివరాలను సేకరించారు. గురువారం ఒంగోలులోని పోలీసు కళ్యాణమండపంలో ఈ మేరకు ప్రస్తుతం ఉన్న గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన అధికారులు సమావేశమయ్యారు. నెల్లూరు రీజియన్ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నివేదికలు తయారు చేశారు. ఈ ఏడాది జూన్ 30 వరకు పరిగణనలోకి తీసుకొని మూడేళ్లు నిండిన ఎస్సై నుంచి ఆపై అధికారులను బదిలీ చేయాలని నిర్ణయించారు. అంతేగాకుండా సొంత జిల్లాలో పనిచేసే అధికారులను తప్పనిసరిగా ఇతర జిల్లాకు బదిలీ చేయనున్నారు. అదేక్రమంలో ఎస్సైల వరకు డివిజన్ల బదిలీలు ఉంటాయని చెప్పారు.

ప్రస్తుతం ఒంగోలు డివిజన్‌లో పనిచేస్తున్న వారు మార్కాపురం డివిజన్‌కు బదిలీ చేస్తారు. సీఐ, ఆపైస్థాయి అధికారులు అయితే కచ్చితంగా జిల్లా నుంచి తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. అదేక్రమంలో ఆయా అధికారుల నుంచి నాలుగు ప్రాంతాల్లో ఆప్షన్స్ తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి బదిలీల ప్రక్రియ చేపట్టామని ఎస్ఈబీ అధికారులు తెలిపారు. సమావేశంలో ఎస్ఈబీ ఇన్‌చార్జి జేడీ, ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, తిరుపతి జేడీ ఎ.రాజేంద్ర, గుంటూరు జేడీ ఎం.వెంకటేశ్వర్లు, బాపట్ల జేడీ పి.మహేష్, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, ప్రకాశం ఎస్ఈబీ ఈఎస్ ఎం.సుధీర్‌బాబు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

- పదో రోజుకు చేరిన సమ్మె


చీరాల గడియార స్తంభం సెంటర్లో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

అద్దంకిటౌన్, జనవరి 4: కార్మికులు తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని గత పదిరోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండి కార్మికులు జీవితాలతో చెలగాటం అడుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి అన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు తమ డి మాండ్‌ల సాధన కోసం చేపట్టిన సమ్మె గురువారానికి పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టి ధర్నా కార్యక్రమ శిబిరంలో కార్మికులు గొంతుకు ఉరితాళ్ళు బిగించుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటే శ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూని యన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాము, గాలి బీష్మా, బత్తుల కృష్ణ, దర్శి వీరయ్య, అలివేలు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ పారిశుధ్య కార్మికుల నిరసన

చీరాల, జనవరి 4: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం పదో రోజుకు చేరింది. భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం ని యంత పోకడలతో సమ్మె ను, తమ సంఘటిత శక్తిని అణచివేసేందుకు ప్రయ త్నం చేయటం దుర్మార్గమన్నారు. సీఐటీయూ, ఏటీటీ యూసీ ప్రతినిధులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఎందుకు ఇవ్వకూడదో ప్రభుత్వం చెప్పాలన్నారు. సమ్మెకు యూటీఎఫ్ బాధ్యులు ఎస్‌కే జానీబాషా, కుర్రా శ్రీనివాస రావు సంఘీభావం తెలపారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ ప్రతినిధులు ఎన్.బాబూరావు, బి.సామ్యేలు, ఏ.బాబూరావు, కోటిదాసు, ఎం.అయ్యపరెడ్డి, మున్సిపల్ కార్మిక సంఘాల బాధ్యులు నూతలపాటి రాజు, డొక్కా మాల్యాద్రి, మేరమ్మ, శంకర్, బడుగు కుమారి, కోటేశ్వరమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ఇంకొల్లు: ఇంకొల్లు ప్రధాన కూడలిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్మికుల నిరసనలు చేస్తున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రావాల్సిన నాలుగు నెలల జీతాలు వెంటనే అందజేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు డిమాండ్ చేశారు. కార్మికులకు ఇడుపులపాడుకు చెందిన హైటెక్ సుభాని మద్దతు తెలిపి ఆర్థిక సహాయం అందజేశారు.


అద్దంకిలో గొంతుకు ఉరితాళ్ళు బిగించుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

అంగన్‌వాడీలపై ప్రభుత్వం కక్షపూరిత వైఖరి

- కార్యకర్తలు ధ్వజం
- 25వ రోజుకు చేరిన సమ్మె


చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

చినగంజాం, జనవరి 4: తమపట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మండిపడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తమ న్యాయమైన కోర్కెల కోసం చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం కూడా కొనసాగింది. 25 రోజులుగా సమ్మె చేస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రావడంలేదని అంగన్‌వాడీ మండల సంఘం నాయకులు ఎ.హైమావతి, కె.రంగనాయకమ్మ, పి.ఆదిలక్ష్మి, కె.యానాదమ్మ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్అండ్‌బీ రహదారి వరకు అంగన్‌వాడీ కార్యర్తలు, ఆయాలు ర్యాలీ నిర్వహించారు. తదనంతరం ఆర్అండ్‌బీ రహదారిపై మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్, మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, అయాలు పాల్గొన్నారు.


చీరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద నేలపై పడుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

పర్చూరు, జనవరి 4: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం 24వ రోజుకు చేరింది. కార్యక్రమంలో భాగంగా పర్చూరు సీడీపీవో కార్యాలయం ముందు అంగన్‌వాడీలు బైటాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ జీతాలు పెంచి నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మెకు ఆయా ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతుగా నిలుస్తున్నాయి.

అలాగే, కారంచేడు మండలం కొడవలివారిపాలెంలో ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ అంగన్‌వాడీలు నిరసన గళం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ సంఘ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కన్నా రూ.వెయ్యి జీతం పెంచి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు చర్చల పేరుతో సమ్మెను నీరుకార్చే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. అంగన్‌వాడీలు సమ్మెకు టీడీపీ మండల నాయకులు మద్దతు తెలిపారు.

డిమాండ్లు పరిష్కారమయ్యేవరకు సమ్మె

అద్దంకిటౌన్, జనవరి 4: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించ కపోతే ఏ అధికారి ఆదేశాలను అమలు చేయబోమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కలెక్టర్‌లతో కేంద్రాలు తెరవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించే వరకు ఎటువంటి ఆదేశాలను అమలు చేయబోమని తెల్చిచెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టాన ధర్నా కార్యక్రమంలో అంగన్‌వాడీలకు సీఐటీయూ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జి.శారద, తదితరులు పాల్గొన్నారు.

చీరాల: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వం నుంచి సమాధానం వచ్చేవరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ కార్యదర్శి ఎం.వసంతరావు స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 24వ రోజుకు చేరింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా నేలపై పడుకుని నిరసన తెలిపారు. అంగన్‌వాడీ ప్రతినిధులు సుజీవన, బ్యూలా, శిరీష మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించ కుండా జరుగుతున్న జగన్మాయకు తెరదించే రోజులు దగ్గర పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బల్లికురవ: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు తెలిపారు. గురువారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు అబద్ధపు హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పిందన్నారు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. న్యాయబద్ధంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడటం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, శ్రీలలిత, సునంద, నిర్మల, శివపావని, వెంకటరమణ, సరస్వతి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నేత రాయిణి వినోద్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంగులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన శిబిరాన్ని గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరడం నేరమా? అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలుగ్రామాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అరాచక పాలనపై తిరుగుబాటు

- 'రా కదలి రా' ను జయప్రదం చేయండి
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


కనిగిరిలో ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జన వరి 4: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, అసమర్థ అరాచక రాజకీయంపై సొంత పార్టీ నేతల అసమ్మతి గళం వినిపిస్తున్నారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఓప్రకటన విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం తీరుపై ఆపార్టీ ఎమ్మెల్యేలు ఆత్మస్థైర్యం కోల్పోయారన్నారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో అరాచకం, దౌర్జన్యం, దోపిడి తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రజలంతా జనాసుర పాలన అంతమొందించాలని దీక్షబూనారని ఆయన పేర్కొన్నారు. అరాచక ఉన్మాదపాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. జగన్‌ను నమ్మి మోసపోయామని ఆయన వెంట నడిచిన ఎమ్మెల్యేలే చెప్పడం ఆయన దుష్టపాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక..

ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గుడ్‌బై చెప్తున్నారని ఏలూరి పేర్కొన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీ ఎమ్మెల్యేలు వైసీపీకీ గుడ్‌బై చెప్తున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని రాజీనామాలు చేస్తున్నారన్నారు. వైసీపీలో చాలా మంది ఎంపీలు తమ రాజకీయ భవిష్యత్ ఎలా ఉంటుందో వారికే అర్థంకాని పరిస్థితిలో ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి ఐదేళ్ళు వెనక్కిపోయిందన్నారు. ప్రజల నుండి వస్తున్న నిరసన జ్వాలలకు ఆహుతి కాకముందే పార్టీని వీడి ఇతర పార్టీలోకి పోతున్నారని ఏలూరి అన్నారు.

శుక్రవారం కనిగిరిలో జరిగే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపు నిచ్చారు. తెలుగుదేశం పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అయోధ్య శ్రీరాముని అక్షితలు పంపిణీ

వేటపాలెం(చీరాల), జనవరి 4: మండలంలోని రామన్నపేటలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి ఆలయంలో భక్తులకు అయోధ్య రాముని అక్షింతలను పండితులు, పురోహితులు, అర్చకులు, ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చల్లా రామరావు తదితరులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించే శ్రీరాముని పూజా కార్యక్రమాల నేపథ్యంలో ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో ఐదు దీపాలు వెలిగించి పూజాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనం తరం సుమారు 500 మంది భక్తులకు అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలు, వేటపాలెం జడ్పీటీసీ బండ్ల తిరుమలాదేవి, అసోసియేట్ ప్రెసిడెంట్ బండ్ల బాబు, ప్రధానకార్యదర్శి యారాసు అరుణ్‌బాబు, గుత్తి సదాశివరావు, రామలింగం, ఆదిలక్ష్మి, రేణుక, రాధ, ప్రసన్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు, జనవరి 4: మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో అయోధ్య రాములవారి అక్షింతలు గ్రామంలోని ప్రధానవీదుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. కార్యక్రమంలో చింతా రామారావు, చింతా శ్రీధర్‌బాబు, యర్రంరెడ్డి శ్రీనివాసరెడ్డి, చీతిరాల అనంతరామయ్య, మోటుపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ వర్క్‌షాప్‌నకు తరలివెళ్లిన నేతలు

చీరాల, జనవరి 4: టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ వర్క్‌షాప్‌నకు ఆపార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆదేశాల మేరు చీరాల శ్రేణులు తరలివెళ్లారు. వర్క్‌షాప్‌నకు వెళ్లినవారిలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు కొత వరపు జనార్ధనరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నాశిక వీరభద్రయ్య, తేలప్రోలు నాగేశ్వరరావు, కోటి మోహన్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు అంగిరేకుల వెంకటేశ్వరరావు, కోసూరి శ్రీనివాస్, అవ్వారు సాంబయ్య, డి. రూపవతి, పి.నాగరాజు, పి.సాయిబాబు తదితరులు ఉన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం

వేటపాలెం(చీరాల), జనవరి 4: అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని అందిన సమాచారంతో అయోధ్యనగర్‌లో ఎస్సై సురేష్ సిబ్బందితో కలసి నిర్వహించిన దాడులలో 96(క్వార్టర్) సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ మహిళ నుంచి 80 మద్యం సీసాలు, మరో వ్యక్తి నుంచి 16 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

వరి పంట కోత, నూర్పిడి ప్రయోగం

వేటపాలెం(చీరాల), జనవరి 4: మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం -2 రైతు భరోసా కేంద్రం పరిధిలో గురువారం ఏవో కాశీవిశ్వనాథ్ పర్యవేక్షణలో వరి పంట కోత, నూర్పిడి ప్రయోగం జరిగింది. నిర్ణీత విస్తీర్ణంలో కోతకు వచ్చిన వరిని కోశారు. ఆతరువాత నూర్పిడిచేసి, కాటా వేశారు. ఈ ఏడాది మాగాణి రైతులకు ఎకరాలకు 30 నుంచి 35 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనావేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్‌ఓ చాముండేశ్వరి, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏజెంట్లు అనిల్, గోపి, విఏఏలు జ్యోతి, సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్‌గా పొన్నలూరి

అద్దంకిటౌన్, జనవరి 4: తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికార సమితి బాపట్ల పార్లమెంట్ కన్వీనర్‌గా అద్దంకికి చెందిన పొన్నలూరి కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈసందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కన్వీనర్‌గా ఎంపిక చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు, పదవి రావడానికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు, రాష్ట్ర బ్రాహ్మణ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు సాయినాధశర్మకు, బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చిం రామ్‌ప్రసాద్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాపోటీల్లో సత్తా చాటిన ఇంకొల్లు విద్యార్థులు

ఇంకొల్లు, జనవరి 4: ప్రకాశం జిల్లా పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిసెంబరు 30, 31 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలలో ఇంకొల్లు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీలలో రాష్ట్రంలోని 17 జిల్లాల బాలబాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో బాపట్ల జిల్లా జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ జట్టులో ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో విద్యార్థులను, వ్యాయామోపాధ్యాయుడు మధుమూర్తిని ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు, ఆదినారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కాకానిపాలెం పాఠశాలకు వితరణ

అద్దంకిటౌన్, జనవరి 4: పట్టణంలోని కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత, ఉపాధ్యాయుడు హనుమంతరావు పాఠశాల అవసరాలకు ఉపయోగకరమైన ప్రింటర్, స్కానర్‌ను అందజేశారు. రూ.18 వేలతో ప్రింటర్, స్కానర్‌ను హెచ్ఎం గురవయ్యకు అందజేశారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

అద్దంకిటౌన్, జనవరి 4: మాల మహానాడు, అద్దంకి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో శింగరకొండ ఆశ్రమంలోని వృద్ధులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. యద్దనపూడి సర్పంచ్ వలేరు రేణుకబాలకోటేశ్వరరావు ఆర్థిక సహకారంతో 50 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్టు మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, జ్యోతి పార్థసారధి, నూతలపాటి సురేష్, పోలయ్య, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు


పింఛన్లను అందజేస్తున్న హనిమిరెడ్డి

బల్లికురవ, జనవరి 4: గ్రామాలలో అర్హత ఉన్న ప్రతిఒక్కరికి పించన్లు మంజూరు చేయిస్తామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి తెలిపారు. గురువారం బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా మంజురయిన 79 మందికి పింఛన్లు అందజేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నిధులు మంజురు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఎంపీడీవో బ్రహ్మయ్య, జడ్పీటీసీ చింతల అంజలి, తహసీల్దార్ రవిబాబు, ఏపీఎం సురేంద్రబాబు, పలుగ్రామాల వైసీపీ నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

బల్లికురవ, జనవరి 4: మండలంలోని కొణిదెనలో ఓ ఇంట్లో మద్యం అమ్మకాలు చేస్తుండగా గురువారం ఎస్ఐ వేమన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 9 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో అనుమతులు లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాలలో ఘర్షణలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పంగులూరు, జనవరి 4: మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. గ్రామస్థులు సమిష్టిగా నిధులు సమీకరించి నిర్మించ తలపెట్టిన ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

పంగులూరు, జనవరి 4: పంగులూరులోని భవిత కేంద్రంలో గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు పలు పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హెచ్ఎం బాచిన లలితకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మస్తాన్‌వలి, దిలీప్, హేమ, ఐఈఆర్‌డీ ఆర్పీలు పి.యోహాన్, టి.అరుణ, కల్పన పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్‌గా ముసలారెడ్డి బాధ్యతల స్వీకరణ

సంతమాగులూరు, జనవరి 4: సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ వైస్ చైర్మన్‌గా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు యిప్పల ముసలారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణ్యం హనిమిరెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పాల్గొని ముసలారెడ్డికి అభినందనలు తెలిపారు.

నేడు రంగవల్లుల పోటీలు

ABN ఆంధ్రజ్యోతి

నెల్లూరు, కావలి, గూడూరులలో నిర్వహణ



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అభిమాన పాఠకులైన నారీమణుల కోసం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో శుక్రవారం ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" సారథ్యంలో నెల్లూరులోని చందన బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ మైదానం, కావలిలో కార్పొరేషన్ రీడింగ్ రూమ్, గూడూరులోని సనత్‌నగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఈ పోటీలు జరగనున్నాయి. మధ్యాహ్నం న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేసి, అతిథులు బహుమతులు అందజేయనున్నారు.


- నెల్లూరు (సాంస్కృతికం)

ఉద్యమాల పురిటిగడ్డ నెల్లూరు జిల్లా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిపై తిరుగుబాట్ల అడ్డాగా మారిపోయింది. తన మాటే శాసనంగా నాలుగున్నరేళ్లు అధికారం చెలాయించిన జగన్‌కు జిల్లా నుంచి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఆయన నాయకత్వాన్ని ధిక్కరించే స్థాయిలో వరుస తిరుగుబాట్లు ఎదురవుతున్నాయి. జిల్లాలో ముగ్గురు సిటింగ్ ఎమ్మెల్యేలు జగన్ ఆధిపత్యాన్ని ప్రశ్నించడంతో రాష్ట్రంలోని తిరుగుబాట్లకు తొలి బీజం పడింది. ఇక అంతా సర్దుకున్నదిలే అనుకున్న తరుణంలో కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ధిక్కారస్వరం వినిపించారు. ఐప్యాక్ బృందం, పార్టీ జిల్లా నాయకుల ద్వారా పంపిన సందేశాలను సున్నితంగానే తిరస్కరించారు. రాజకీయాల కోసం తన వ్యక్తిత్వాన్ని చంపుకొని రాజీపడనని, ఈ విషయంలో తగ్గేదే లేదని ఐప్యాక్ బృందం ద్వారా జగన్‌కు తన వాణి వినిపించారు. రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన ఈ విషయం జిల్లా వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది.


కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ధిక్కారస్వరం

జగన్‌కు మరో ఝలక్!

- చంద్రబాబు, లోకేష్‌లను తిడితేనే టికెట్ అన్న ఐప్యాక్ బృందం
- అకారణంగా తిట్టను.. టికెట్ విషయం ఆయన ఇష్టమన్న మహీధర్
- మొన్న ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, ఆనం, మేకపాటి!
- తిరుగుబాటుదారులందరూ జగన్ సామాజిక వర్గానికి చెందినవారే.!



నెల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాల వారీగా వైసీపీ అభ్యర్థులను ఖారారు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొంతమంది సిటింగ్ ఎమ్మెల్యేల విషయం ఎటూ తెల్చకుండా జగన్ హోల్డులో ఉంచారు. ఆ జాబితాలో కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి పేరు కూడా ఉంది. ఈయనకు టికెట్టు ఇవ్వాలని జిల్లా నాయకత్వం జగన్ దృష్టికి తీసుకొచ్చింది. అయితే, అభ్యర్థుల విశ్వసనీయతను లెక్కించే క్రమంలో చంద్రబాబును, లోకేష్‌ను తిట్టే వారే నమ్మకస్థులుగా వైసీపీ అధిష్ఠానం భావించినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రెస్‌మీట్ పెట్టి చంద్రబాబును, లోకేష్‌ను తిడితేనే విశ్వసనీయుడిగా గుర్తించి టికెట్టు ఇస్తామని రెండు రోజుల క్రితం ఆ పార్టీ జిల్లా నాయకుల ద్వారా మహీధర్‌రెడ్డికి సందేశం పంపినట్లు తెలిసింది. అయితే, దీనిని ఆయన పట్టించుకోలేదు. గురువారం మరోసారి ఐప్యాక్ బృందం మహీధర్‌రెడ్డిని కలవగా ఆయన కుదరదు అని ఖరాకండిగా చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఐప్యాక్ వెంటనే అధిష్ఠానానికి చేరవేసింది. మహీధర్‌రెడ్డి ధిక్కార స్వరాన్ని, తిరుగుబాటును వైసీపీ అధినాయకత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు చెబుతున్నారు. గురువారం సాయంత్రం కందుకూరుతో సత్సంబంధాలు కలిగిన కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను అమరావతికి పిలిచి రహస్యంగా చర్చించినట్లు సమాచారం.


ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

రోజు : గురువారం

స్థలం : కందుకూరు

విషయం : నెల్లూరుకు చెందిన వైసీపీ నేతతో కలిసి ఐప్యాక్ బృందం ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని కలిసింది. అసెంబ్లీ టికెట్టు విషయమై వారి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు..

ఐప్యాక్ : పార్టీ అధిష్ఠానం మమ్మల్ని మీ దగ్గరకు పంపింది. మీరు ఇవాళే ప్రెస్‌మీట్ పెట్టి టీడీపీ అగ్రనేతలు నారా చంద్రబాబు, లోకేష్‌లను తిట్టాలని ఆదేశించింది.

ఎమ్మెల్యే : అకారణంగా ఒకరిని తిట్టమని చెబితే నేను తిట్టేవాడిని కాను. నాది అలాంటి వ్యక్తిత్వం కాదు. ఈ మాట అధిష్ఠానానికి చెప్పండి.

ఐ ప్యాక్ : చంద్రబాబును, లోకేష్‌లను తిట్టని పక్షంలో టికెట్టు ఇవ్వకపోవచ్చు. ఆలోచించుకోండి.

ఎమ్మెల్యే : టికెట్టు విషయం ఆయన (జగన్‌రెడ్డి) ఇష్టం. ఇచ్చినా, ఇవ్వకున్నా సరే నేను మాత్రం అకారణంగా ఒకరిని తిట్టమంటే తిట్టే వ్యక్తిని కాదు. ఈ విషయాన్ని పార్టీ పెద్దలకే చెప్పండి.

● ఇది నాల్గవ షాక్!?

నెల్లూరు జిల్లా వైసీపీ నేతలు జగన్‌కు షాకుల మీద షాకులు ఇస్తున్నారు. కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిలు వైసీపీ అధినేత జగన్‌రెడ్డిపై తిరుగుబాటు ప్రకటించి పార్టీ నుంచి వెలుపలికి వచ్చారు. కొద్ది రోజుల వ్యవధిలోనే తెలుగుదేశం సాదర ఆహ్వానం మేరకు ఆ పార్టీలో చేరారు. వాస్తవానికి జగన్‌కు ఇది భారీ షాక్. ముగ్గురు బలమైన నాయకులు ఏకకాలంలో తిరుగుబాటు ప్రకటించి వెలుపలకు వచ్చిన కొద్ది రోజుల వ్యవధిలోనే జిల్లాకు చెందిన మరో బలమైన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి తిరుగుబాటు వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఉభయ తెలుగురాష్ట్రాల రాజకీయ వర్గాల్లో నెల్లూరు జిల్లా ప్రస్తావన మరోసారి మారుమోగుతోంది. విశేషమేమంటే ఇప్పటికి తిరుగుబాటు ప్రకటించిన ముగ్గురు ఎమ్మెల్యేలు, తాజాగా ధిక్కార స్వరం వినిపించిన మహీధర్‌రెడ్డి వీరందరూ జగన్ సామాజికవర్గానికి చెందినవారే కావడం ఒక విశేషమైతే, అందరూ వైఎస్ కుటుంబానికి వీర విధేయులుగా గుర్తింపు పొందిన నాయకులు కావడం మరో విషయం. ఆత్మాభిమానం కలిగిన ఏ నాయకుడు జగన్ వ్యవహార శైలిని జీర్ణించుకోలేరని చెప్పడానికి జిల్లాలో జరిగిన, జరుగుతున్న తిరుగుబాట్లను రాజకీయ వర్గాలు ఉదాహరణగా చూపుతున్నాయి.



నెల్లూరు: ఆత్మకూరు బస్టాండ్ వద్ద మున్సిపల్ కార్మికుల నిరసన ర్యాలీ

ఇచ్చిన మాట నిలబెట్టుకో జగన్!

- సామాజిక సాధికారత అంటే మా హక్కులను కాలరాయడం కాదు
- భగ్గుమన్న మున్సిపల్ కార్మికులు
- నెల్లూరులో ప్రదర్శన, కావలిలో అరెస్ట్

నెల్లూరు (సిటీ), జనవరి 4 : జగన్.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడం, ఇచ్చిన హామీలపై మడమతిప్పడం మంచిదికాదు. ప్రతిపక్షంలో ఉన్న రోజులు గుర్తుచేసుకో..' అంటూ పారిశుధ్య కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ డిమాండ్ల సాధన కోసం వారు చేస్తున్న సమ్మె గురువారం నాటికి పదవ రోజుకు చేరుకుంది. నెల్లూరులోని నవాబుపేట జలకన్య కూడలి నుంచి ఏబీఎం మైదానం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాయడం సామాజిక సాధికారత అనిపించుకోదని స్పష్టం చేశారు. దళిత, గిరిజనుల పట్ల మొండి వైఖరితో వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. ఔట్‌సోర్సింగ్‌లో ఉన్న మున్సిపల్ వర్కర్లను పర్మినెంట్ చేసే వరకు ఉద్యమం కెరటంలా కొనసాగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో నాయకులు పెంచలనరసయ్య, అల్లాడి గోపాల్, సూర్యానారాయణ, చెంగయ్య, నరసింహ, కత్తి పద్మలు పాల్గొన్నారు.

● కావలిలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ప్రైవేటు కూలీల ద్వారా తొలగించే యత్నం చేశారు. అయితే, వీరిని పారిశుధ్య కార్మికులు అడ్డుకొని రోడ్డుపై బైఠాయించారు. కమిషనర్ ఫిర్యాదుతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని, కాసేపటికి విడుదల చేశారు. ఆత్మకూరు, కందుకూరులలోనూ సమ్మె కొనసాగుతోంది.


కావలిలో రోడ్డుపై బైఠాయించిన కార్మికులతో మాట్లాడుతున్న పోలీసులు



పోలీసు స్పోర్ట్స్

ఓవరాల్ చాంపియన్ ఏఆర్ వింగ్

- ముగిసిన పోటీలు
- బహుమతులు అందజేసిన ఐజి పాలరాజు

నెల్లూరు(క్రైం), జనవరి 4: నెల్లూరులోని పోలీసు కవాత్తు మైదానంలో జరుగుతున్న పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ గురువారంతో ముగిసింది. జిల్లాలోని ఐదు సబ్‌డివిజన్లు, ఏఆర్, హెచ్‌జీ, డీపీవో విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది స్పోర్ట్స్ మీట్‌లో ఉత్సాహంగ పాల్గొన్నారు. ఇండివిడ్యువల్ చాంపియన్షిప్ (మెన్)ను ఏఆర్ వింగ్‌కు చెందిన ఆర్ఎస్ఐ సురేష్ దక్కించుకోగా, ఇండివిడ్యువల్ చాంపియన్షిప్ (ఉమెన్)ను ఏఆర్ వింగ్‌కే చెందిన కానిస్టేబుల్ చందన దక్కించుకున్నారు. మొత్తం మీద ఓవరాల్ చాంపియన్షిప్‌ను నెల్లూరు ఏఆర్ వింగ్ కైవసం చేసుకుంది. గురువారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోలీస్ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం ద్వారా సంపూర్ణ శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, ఫిట్‌నెస్ లభిస్తాయని చెప్పారు. ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. ప్రతి మనిషి జీవితంలో ఏదో ఒక వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. క్యాంప్ ఫైర్ వెలిగించి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

13న జిల్లా క్రికెట్ లీగ్‌కు ఎంపికలు

నెల్లూరు (విద్య), జనవరి 4 : ఈనెల 13వతేదీ ఉదయం 9 గంటలకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-17, 23 జిల్లా క్రికెట్ లీగ్ పోటీలకు జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. లీగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు అంతర్‌జిల్లాల పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు.

చట్టప్రకారమే అంగన్‌వాడీల సమ్మె

- వీరిని తొలగించే అధికారం ఎవరికీ లేదు!
- 9వ తేదీలోపు సమస్యలు పరిష్కరించాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు
- జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె




నెల్లూరులో అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

నెల్లూరు (వైద్యం) జనవరి 4 : అంగన్‌వాడీలు చట్ట ప్రకారమే సమ్మె చేస్తున్నారని వారిని తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగ రావు స్పష్టం చేశారు. గురువారం నెల్లూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ డిమాండ్లపై ప్రభుత్వంతో అనేక దఫాలు చర్చలు జరిపినా ఫలితం లేదని చెప్పారు. సమ్మె విరమించకుంటే అందరినీ డిస్మిస్ చేస్తామని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ విజయలక్ష్మి చెప్పారని, చట్టం ఉల్లంఘించి డిస్మిస్ చేయాలంటే ఆ డిస్మిస్ కాగితాలు నాలుక గీసుకోటానికి కూడా పనికిరావని ఎద్దేవా చేశారు. ఇలాంటి బెదిరింపులు మాని అంగన్‌వాడీలతో సామరస్య చర్చలు జరపాలని సూచించారు. లేదంటే ఈ నెల 9న అన్ని కార్మిక సంఘాలు, వివిధ యూనియన్లతో పెద్ద ఎత్తున తరలి వచ్చి అంగన్‌వాడీలకు మద్దతుగా నిలుస్తామని హెచ్చరించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యద ర్శులు దుర్గిరాల సూరిబాబు, సుదర్శన్ రెడ్డిలకు అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, కొండా ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ నేతలు కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి, సుమతి, ఉషా, కల్పన, నాగభూషణమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు కావలి, ఆత్మకూరు, కందుకూరు, ఉదయగిరి, అనంతసాగరం, కోవూరు తదితర ప్రాంతాల్లోనూ సమ్మె కొనసాగుతోంది.

రహదారులను కమ్మేస్తున్న పొగమంచు
ఎదుట వాహనాలు కనిపించక ప్రమాదాలు
ఏమరుపాటు వద్దంటున్న నిపుణులు


జాతీయ రహదారిపై లైట్ల వెలుగుల్లో వస్తున్న వాహనం

మంచుదుప్పటి ముంచునేమో!

నెల్లూరు (స్టోన్ హౌస్ పేట), జనవరి 4 : ఎటు చూసినా మంచు.. కనీసం పది మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తి కూడా కనిపించనంత స్థాయిలో పొగమంచు కప్పేస్తోంది. ఉదయం 8 గంటలకు కూడా భాను డు మంచు తెరల నుంచి బయటకు రానంటున్నాడు. చలిపులిని తట్టుకోలేక ప్రజలు గడపదాటి బయటకు రావడం లేదు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వస్తున్న వాహనదారులకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లాలో కోల్‌కత్తా- చెన్నై, నెల్లూరు-బద్వేలు, సింగరాయకొండ - కందు కూరు, ఏర్పేడు-నకిరేకల్ జాయతీ రహదారులు ఉన్నాయి. వీటితో పాటు ఉన్న రాష్ట్ర జిల్లాస్థాయి రహదారులు ఉన్నాయి. పొగమంచు కారణంగా అవసరం ఉంటేనే ప్రయాణాలు చేయాలని, వాహన డ్రైవింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

● ఇష్టానుసారంగా పార్కింగ్‌లు

పొగమంచు కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో 50 శాతానికిపైగా ఆగిఉన్న వాహనాలను ఢీకొనడం ద్వారానే. జాతీయ రహదారుల పక్కన నిలిపి ఉన్న వాహనాలు మంచులో కనిపించక పోడంతో వెనుక నుంచి వాటిని ఢీకొని ప్రయాదాలు అధికంగా జరుతున్నాయి. ప్రమా దాల నివారణకు తాము సూచించిన రెస్ట్ ఏరియాలోనే వాహనాలు పార్కింగ్ చేయాలని హైవే అథారిటీ అధికారులు సూచిస్తున్నారు.

● డిసెంబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు జిల్లాలో పొగమంచు అధికంగా ఉంటుంది. దట్టమైన పొగమంచులో వెళ్లేటప్పుడు కారులోని విపత్తు హెచ్చరికల లైట్లు ఆన్‌చేయాలి. ఇలా చేయడం ద్వారా రహదారి మీద మన కారు ఉనికిని ఇతర వాహనదారులు గుర్తించే అవకాశం ఉంటుంది.

● పొగమంచులో వెళ్లే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ చేతులను ఎప్పుడూ స్టీరింగ్ మీదనే ఉంచాలి. మలుపుల్లో వెంటనే స్పందించి స్టీరింగ్ తిప్పుతూ అదుపు చేసేలా ఉండాలి. ఇవన్నీ జరగాలంటే తక్కువ వేగంతో వాహనం నడిపితేనే సాధ్య మవుతుంది.

● జాతీయ, రాష్ట్ర రహదారులపై ఉన్న రేడియం లైనింగ్ గుర్తులను అనుసరిం చాలి. వంతెనలు, ఇరుకైన రోడ్డు ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తెలుపు, పసుపు రంగుల్లో రోడ్డు మార్కులను గమనించాలి.

● కారులో డీ ఫాగర్‌ను ఆన్ చేసుకోవడం వల్ల అద్దాలపై పేరుకుపోయిన మంచు కరిగిపోతుంది.

● డ్రైవింగ్‌లో ఏకాగ్రత కోసం వాహనంలో మ్యూజిక్ సౌండ్ తక్కువగా, వీలైతే ఆఫ్ చేయడం ఉత్తమం. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. ముందు వెళుతున్న వాహనానికి కనీస దూరం పాటించాలి.

● వాహనాల హెడ్‌లైట్ల పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ఒక లైటు మాత్రమే పని చేస్తున్నా, లైట్లలో వెలుగు తక్కువ ఉన్నా ప్రయాణం వాయిదా వేసుకోవడం ఉత్తమం.


హైవేను కమ్మేసిన పొగమంచు

అత్యవసరమైతేనే ప్రయాణించండి



పొగమంచు అధికంగా ఉన్న సమయంలో అత్యవ సరం అనుకుంటేనే ప్రయాణాలు చేయండి. డ్రైవింగ్‌పై ఏకాగ్రతతో తక్కువ వేగంతో వాహనం నడపాలి. రోడ్డు పూర్తిగా మంచుతో కమ్మేసి ఉంటే వాహనాలను రెస్ట్ ఏరియాలో పార్క్ చేసుకోవడం మంచిది. రోడ్డు పక్కన వాహనాలు ఆపుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

- చందర్, డీటీసీ

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కావలిటౌన్: శిబిరంలో మాట్లాడుతున్న విజయకుమార్



ఆత్మకూరు : నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కావలిటౌన్, జనవరి 4: ప్రభుత్వానికి కార్మిక, కర్షక, ప్రజా సమస్యలు పట్టడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గండవరం విజయకుమార్ ఆరోపించారు. ఆర్డీవో కార్యాలయం ఎదురుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలు న్యాయమైన సమస్యల పరిష్కారం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా పాలకులు దిగిరాకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, రఘురావమ్మ, విజయలత, సీఐటీయూ నాయకులు పెంచలయ్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. స్థానిక అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారం కూడా కొనసాగగా కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎస్కే రహంతున్నీషా, రాజేశ్వరి తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళనలు కొనసాగుతాయన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు, నిర్బంధాలకు లొంగే ప్రశ్నేలేదని స్పష్టం చేశారు.

ఆత్మకూరు: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. గురువారం వారు విధులను బహిష్కరించి స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. వీరికి మద్దతుగా సీఐటీయు నాయకులు ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం అన్యాయని సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నినాదాలతో కూడిన నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు చాంద్‌బేగం, ప్రమీలా, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం: స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట గురువారం అంగన్‌వాడీల నిరసన కార్యక్రమం జరిగింది. తమ డిమాండ్‌లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో జేవీవీ నాయకులు గాడి సుధాకర్, వేము పెంచలయ్య, సీఐటీయూ నాయకులు అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ నిలబెట్టుకోమని ముఖ్యమంత్రికి చెప్పండయ్యా..

వరికుంటపాడు: తమ వేతనాలను పెంచుతానని ఎన్నికల సమయంలో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మీరైనా చెప్పండయ్యా అంటూ గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని అంగన్‌వాడీ కార్యకర్తలు వేడుకున్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు షేక్ రజియా ఆధ్వర్యంలో సమస్యను విన్నవించుకునేందుకు మూకుమ్మడిగా అక్కడికి చేరుకున్న కార్యకర్తలను పోలీసులు అడ్డుకొని ఆంక్షలు విధించినప్పటికీ లెక్కచేయకుండా ఒక్కసారిగా ఆయన వద్దకు చేరుకొని వినతిపత్రం అందచేశారు. కాగా వినతిపత్రం అందుకున్న ఆయన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

ఉదయగిరి రూరల్, జనవరి 4: స్థానిక భవిత కేంద్రంలో గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ద్వారా దృష్టిలోపం గల విద్యార్థినికి ట్యాబ్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కలీం, రామకృష్ణారెడ్డి, ఐఆర్పీలు సుభాస్‌చంద్రబోస్, శివ, నందిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శకునాలపల్లిలో గ్రామసభ

ఉదయగిరి రూరల్, జనవరి 4: మండలంలోని శకునాలపల్లి పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ అభివృద్ధికి అవసరమైన తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 4: మండలంలోని నందిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణంపై తన సిబ్బందితో దాడులు నిర్వహించనట్లు ఎస్‌ఐ ఉమాశంకర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ దాడుల్లో 12 మద్యం సీసాలతోపాటు నిర్వాహకున్ని అదుపులోకి తీసుకొన్నామన్నారు.

మర్రిపాడు: బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదుచేసి గురువారం కోర్టుకు హాజరు పరిచారు. పోలీసుల వివరాల మేరకు.. నందవరం, రాంపల్లిలో అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వ హిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించి, నందవరంలో కొండమ్మ అనే మహిళ నుండి 22 మద్యం సీసాలు, రాంపల్లిలో శ్రీనివాసులు నుండి 4 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వరికుంటపాడు, జనవరి 4: ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుడు మల్లంపాటి మోహనరావు కుటుంబానికి గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. శాఖ జిల్లా కార్యదర్శి ఆర్ నాగార్జున మాట్లాడుతూ తమవంతు చేయూతగా కుటుంబ సభ్యులకు రూ. 1.25లక్షల నగదు చెక్కును అందజేశామన్నారు. కుటుంబ సంక్షేమ డైరక్టర్ కరీముల్లా, మేడసాని సుబ్బారావు, ఎల్‌వీ నారాయణ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం : బొల్లినేని



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బొల్లినేని

ఉదయగిరి రూరల్, జనవరి 4: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం అని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. గురువారం ఉదయగిరి పట్టణంలోని తుపాన్‌నగర్, దేవలాలగడ్డ తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజాదీవెన యాత్ర చేపట్టి ఇంటింటికి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, సందానీ, సజిల్, ఖాన్‌సా, మాబాషా, బొజ్జా నరసింహా, శివకృష్ణ, ఖాదర్‌బాషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

వింజమూరు, జనవరి 4: స్థానిక ఐదో ఆర్‌బీకేలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీడీపీఎం అడిషనల్ డీపీఎం మాలకొండయ్య, మునిరత్నంలు రైతులకు, వ్యవసాయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏ చంద్ర, ఎంపీట అంజనరెడ్డి, హజరత్, సుజాత, వినోద్, ఇతర వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్‌డీవో

చేజర్ల, జనవరి 4: మండలంలో పలు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆత్మకూరు ఆర్డీవో కె మధులత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండల అధికారులు ఇచ్చిన వివరాల మేరకు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పుట్టుపల్లి, గొల్లపల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు లేకపోవడంపై జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వాలని తహసీల్దారును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పి క్రిష్ణ, ఆర్‌ఐ సుమతి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ఆత్మకూరు, జనవరి 4 : పట్టణంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11-30 గంటల నుంచి 1-30 వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి జనార్థన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూరు, ఉదయగిరి సబ్ డివిజన్ల పరిధిలోని అన్ని సెక్షన్లకు సంబంధించి విద్యుత్ అదాలత్ జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ దేవసేనమ్మ

ఆత్మకూరు, జనవరి 4 : ప్రైవేట్ డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ హెచ్చరించారు. గురువారం ఆమె ఆత్మకూరు పట్టణం, మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 64 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 74 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ ఫార్మర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, మండల వ్యవసాయశాఖాధికారి కె కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

సంగం, జనవరి 4: స్థానిక తుంగా దయాకర్‌రెడ్డి కల్యాణ మండపంలో గురువారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. కాగా, పంచాయతీకి ఒకరికి చొప్పున పంపిణీ చేసి మిగిలినవారికి శుక్రవారం నుంచి గ్రామాల్లో వలంటీర్లు ఇస్తారని తెలిపారు. దీంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నూతన పింఛన్లు ఒక్కటి కూడా ఇవ్వలేదు. దీంతో కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు తమకు పింఛన్ వస్తుందని ఎంతో ఆశగా సమావేశానికి వచ్చి నిరాశకు గురయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, జడ్పీటీసీ రాజేశ్వరమ్మ, ఎంపీపీ పద్మజారెడ్డి, రాజవోలు సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ కాటంరెడ్డి నరసింహారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సందాని, నాయకులు జిలాని బాషా, కోటిరెడ్డి, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు (ఉదయగిరి రూరల్) : అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, సొసైటీ అధ్యక్షులు మండ్ల శివ, తుమ్మల వెంగయ్య, నాయకులు ఎల్‌పీ మాలకొండారెడ్డి, అన్నపురెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మాశిలామణిని ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని అరెస్టు చేయాలి

వింజమూరు, జనవరి 4 : స్థానిక డాక్టర్ మాశిలామణిని ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్, ఏడీపీఎస్ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఎమ్మార్పీఎస్ దళిత సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకులు పందిటి అంబేద్కర్‌మాదిగ, ఏడీపీఎస్ జిల్లా నాయకులు గుజ్జు చెన్నయ్యలు మాట్లాడుతూ నియోజకవర్గంలో 35 సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మాసిలామణిని ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని అరెస్టు చేయకపోతే ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మంద సుజాతమాదిగ, ఎంఎస్పీ, దళిత సంఘాల నాయకులు పి నారాయణ, ఎన్ క్రిష్ణ, పి బాలకేశవులు, జి వెంగళరావు, జి రవీంద్ర, జి రాజా, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల మృతికి వెంకయ్య నాయుడు సంతాపం

ఉదయగిరి రూరల్, జనవరి 4: మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన తుమ్మల రమణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గురువారం వారి కుటుంబ సభ్యులకు సంతాప సందేశాన్ని పంపారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కనిగిరిలో చంద్రబాబు సభ..

భారీగా తరలిరండి : ఇంటూరి



మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జనవరి 4: కనిగిరిలో శుక్రవారం సాయంత్రం జరగనున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి దుర్మార్గపు, చేతగాని పరిపాలనకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందన్నారు. కంభం విజయరామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుపై రాష్ట్ర ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని, మరో మూడునెలల్లో ప్రజల ఆశలు ఫలించబోతున్నాయన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, వేముల గోపాలరావు, నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, ఎన్వీ సుబ్బారావు, చిలకపాటి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

● ఇంటూరికి న్యాయవాదుల వినతి

రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన భూమిహక్కుల యాజమాన్య చట్టాన్ని రద్దు చేసేలా పార్టీపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కందుకూరులో న్యాయవాదులు గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మల్లికార్జునరావు, ఎస్. పవన్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు బెజవాడ కృష్ణయ్య చౌదరి, వలేటి శ్రీధర్‌నాయుడు, చిడిపోతు హరికృష్ణ, బీవీ మురళీకృష్ణ, కె.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

● దివ్యాంగుల పాఠశాలలో జన్మదిన వేడుకలు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు చిన్న కుమారుడు సందీప్ తన జన్మదిన వేడుకలను గురువారం పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాలలో జరుపుకున్నారు. దివ్యాంగ చిన్నారుల సమక్షంలో కేకు కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

● నేడు టీడీపీలోకి బీజేపీ మహిళా నేత

కందుకూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మహిళామోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉన్నం నళినీదేవి శుక్రవారం టీడీపీలో చేరనున్నారు. కనిగిరిలో జరిగే బహిరంగ సభలో పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో ఆమె టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకున్నారు. గురువారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తును సర్వనాశనం చేసిన జగన్మోహన్ రెడ్డిని ఓడించటం లక్ష్యంగా టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నానని వివరించారు.

కావలిలో చెత్త వాహనాల అడ్డగింపు

● మున్సిపల్ కార్మికుల బైండోవర్, విడుదల ● వన్‌టౌన్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత



కందుకూరు : అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలిటౌన్, జనవరి4: మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా గురువారం చెత్తవాహనాలను అడ్డుకోవడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కార్మికులు సమ్మెతో ఎక్కడ చెత్త అక్కడే నిల్వచేరడంతో మున్సిపల్ కమిషనర్ కూలీలతో చెత్త వాహనాలను రంగంలో దించారు. విషయం తెలుసుకున్న కార్మికులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ట్రంకురోడ్డుపై వాహనాలను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. కమిషనర్ శ్రావణ్‌కుమార్ వన్‌టౌన్ స్టేషన్‌కు చేరుకుని మున్సిపల్ విధులకు కార్మికులు అటంక పరిచారని ఫిర్యాదు చేశారు. సీఐ రాజేష్, పోలీస్ సిబ్బంది ఆందోళన చేస్తున్న కార్మికులను అదుపులో తీసుకుని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతో కార్మికులు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకొని అక్కడ నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు కార్మికులను బైండోవర్ చేసుకుని విడుదల చేశారు. కాగా వాహనాలను అడ్డుకున్న కార్మికులపై కమిషనర్ ఫిర్యాదు చేయగా, పోలీసులు బైండవర్ చేసుకోవడం దారుణమని కార్మిక సంఘం నేతలు పేర్కొన్నారు. ఇలాంటి అరెస్టులకు నిర్బంధాలకు భయపడబోమని, ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఆందోళనలో ఏఐటీయూసీ నేతలు మల్లి అంకయ్య, కే. నాగరాజు, ఆదినారాయణ, సీఐటీయూ నేతలు పెంచలయ్య, తురకా శీనయ్య, రమేష్, మహిళా నేతలు పాల్గొన్నారు.

కందుకూరు : సీఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో పారిశుధ్య కార్మికులు రెండవ రోజు గురువారం నిరసన దీక్షలు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో రిలే దీక్షలను మున్సిపల్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసనలో ఏఐటీయూసీ నాయకులు బీ సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, రమణమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరింది. గురువారం వారు విధులను బహిష్కరించి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతను వీడి తక్షణం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు, ఏఐటీయుసీ మున్సిపల్ యూనియన్ నాయకులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

కావలి, జనవరి4: స్థానిక తుమ్మలపెంట రోడ్డులోని భవిత పాఠశాలలో గురువారం హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాష ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించారు. బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు దాత పెళ్లూరు భవిత సహకారంతో ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల జాతీయ సేవా రత్న అవార్డు అందుకున్న సయ్యద్ ఘనీబాషను మంగళగిరి వేణుగోపాల్, డీఎస్పీ ఎం. వెంకటరమణ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో గోవిందయ్య, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అజిత్‌బాబు, భవిత పాఠశాల ఉపాధ్యాయిని లక్ష్మీ, హజరత్తయ్య, క్రాంతి, జాగర్లమూడి, సాయి శివ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ పాలెంలో గడప గడపకు...



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్

బిట్రగుంట, జనవరి 4: బోగోలు మండలం చెన్నారాయునిపాలెంలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామ సర్పంచు కుమారి గిరిబాబు ఆధ్వర్యంలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్ఆర్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం అన్ని ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో ఏపీ ఆప్కాప్ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, ఎంపీపీ మేకల సుజాత, జడ్పీటీసీ ఎం కీర్తన, వైసీపీ నాయకులు వీరరఘు, శ్రీనివాసులు, పెంచలయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్కడినే ఎదుర్కోలేక కూటమి



పింఛన్ నగదు అందచేస్తున్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి

ఉలవపాడు, జనవరి 4 : రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ బాటలో నడిపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలు కూటమి కట్టాయని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి విమర్శించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ కష్టకాలంలో సంక్షేమ పథకాలను అందుకున్న ప్రతి పేదవాడి గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నాడని తెలిపారు. మండలంలో ఈ ఏడాది 110 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్ బ్రహ్మయ్య, ఎంపీడీవో ఎస్ విజయ, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


తీరంలో పసుపులేటి పర్యటన

బిట్రగుంట, జనవరి 4: బోగోలు మండలం తూర్పు తీరప్రాంతంలో గురువారం రాత్రి పీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ పర్యటించారు. జువ్వలదిన్నె పంచాయతీ పరిధిలోని పాత, కొత్త కడపాలాలు, అలిచర్ల బంగారుపాలెం, పాతపాలెం గ్రామాల్లో తిరుగుతూ స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్థులు పూలమాలతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు వెంకటేశ్వర్లు, భాను, పలువురు గంగపుత్రులు, పీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● దుప్పట్ల పంపిణీ

బోగోలు మండలం బిట్రగుంట గిరిజన కాలనీలో గురువారం హైదరాబాద్‌కు చెందిన శ్రీ రామదూత ట్రస్ట్ సభ్యుడు సత్యనారాయణ దాతృత్వంతో దుప్పట్లు అందచేశారు. స్థానికుడు రావి విజయ్‌కుమార్ వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు రావి పెంచలయ్య, పాలకుర్తి శ్రీనివాసులు, కార్తీక్, ప్రసన్న, రంగయ్య, మనోహర్, మజ్ను, నరేంద్ర పాల్గొన్నారు.

నర్సింగ్ స్కూల్‌లో విచారణ



విచారణ జరుపుతున్న డాక్టర్ ప్రియంవద

కందుకూరు, జనవరి 4: నర్సింగ్ విద్యార్థినులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా, వారు పరీక్షలు రాసే అవకాశాన్ని కోల్పోయేలా చేసిన కోటారెడ్డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రియంవద విచారణ నిర్వహించారు. బాధిత విద్యార్థినులతో, పాఠశాల యాజమాన్యంతో మాట్లాడిన ఆమె ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే మహీధర్ అభినందనీయుడు : నార్నే

కందుకూరు, జనవరి 4: చంద్రబాబును, లోకేష్‌ను తిడితేనే నీకు టికెట్ అంటూ సీఎం జగన్ పెట్టిన షరతును బేఖాతరు చేసిన కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అభినందనీయుడని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రెస్‌మీట్ పెట్టి చంద్రబాబు, లోకేష్‌లను విమర్శిస్తేనే టికెట్ ఇస్తానని సీఎం జగన్ చెప్పమన్నాడని మహీధరరెడ్డి వద్దకు వెళ్లిన దూతలతో ప్రెస్‌మీట్ పెట్టేపనే లేదు, అనవసరంగా చంద్రబాబును, లోకేష్‌ను విమర్శించనూ లేను.. టికెట్ ఇస్తారో ఇవ్వరో అది మీ ఇష్టం... అని తేల్చిచెప్పిన మహీధరరెడ్డిని వైసీపీ నేతలంతా ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు.

రూరల్ సీఐతో గౌడ్ సంఘం నేతల భేటీ

కావలి, జనవరి4: రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన కాటూరు శ్రీనివాసులును గురువారం సర్కిల్ కార్యాలయంలో మండల గౌడ్ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. గౌడ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డివిజన్ గౌడ్ సంఘం అధ్యక్షుడు పెనుకొండయ్య గౌడ్, కార్యదర్శి ఉప్పాల శ్రీనివాసులు గౌడ్, నేతలు నాసిన ప్రసాద్ గౌడ్, దాసరి నరసయ్య గౌడ్ పాల్గొన్నారు.

యూరియా కోసం ఎగబడిన రైతులు

అల్లూరు, జనవరి 4 : మండలంలో రబీ సీజన్‌కు అవసరమైన యూరియా కోసం రైతులు ఎగబడుతున్నారు. అల్లూరులోని ప్రైవేటు దుకాణాల్లో కొంతమంది రైతులకే యూరియా ఇస్తున్నారు. మిగిలిన రైతులు ఆర్బీకేల వద్దకు పరుగులు తీశారు. సొసైటీల్లో నిల్వలు లేకపోవడంతో చేసేదిలేక ఆర్బీకేల వైపు మళ్లారు. ఈ క్రమంలో అధికారుల అభ్యర్థన మేరకు సొసైటీలకు యూరియా రావడంతో రైతులు గురువారం సొసైటీల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో ఎమ్మార్పీకే యూరియా లభిస్తుండడంతో రైతులు ఆసక్తి కనపరిచారు. ఉన్న యూరియా బడా రైతులకు అందజేస్తుండడంతో సన్న,చిన్నకారు రైతులు తమకు అందడం లేదని విమర్శిస్తున్నారు.

పాఠశాలల తనిఖీ

కొండాపురం, జనవరి4: మండల పరిధిలోని పలు పాఠశాలలను ఎంఈవో-2 ఆనందరావు గురువారం తనిఖీ చేశారు. కొండాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డులను, విద్యార్థులు తింటున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే బోయళ్లవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రికార్డులను కచ్చితంగా నిర్వహించాలన్నారు.

గంధోత్సవాలకు విరాళం

బిట్రగుంట, జనవరి 4: గంధోత్సవ కమిటీకి పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణ గురువారం విరాళం అందచేశారు. కావలి వైకుంఠపురంలోని నాగూర్ మీరావలి గంధోత్సవానికి ఆమె రూ. 50 వేలను కమిటీ సభ్యులకు అందచేశారు. అలాగే కావలి రూరల్ మండలం ఆనెమడుగులో జరుగుతున్న గంధమహోత్సవానికి రూ. 70వేలను నిర్వాహకులకు ఇచ్చారు.

గిరిజనులకు హైజిన్ కిట్ల పంపిణీ

కావలి, జనవరి4: స్థానిక శాంతినగర్‌లో ఉంటున్న మిచౌంగ్ తుఫాన్ బాధిత గిరిజన కుటుంబాలకు గురువారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో హైజిన్ కిట్లను అందచేశారు. టార్పాలిన్లు, సబ్బులు, పేస్ట్‌లు, నూనెలు, శానిటరీ నాప్కిన్లతో కూడిన హైజిన్ కిట్లను వారికి ఇచ్చారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కార్యదర్శి ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ తుఫాన్‌తో ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు తక్షణ సామగ్రిని అందించామన్నారు. ఈ సామగ్రిని సమకూర్చిన, రాష్ట్ర, జిల్లా రెడ్‌క్రాస్ శాఖలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నేడు ఆరోగ్య సురక్ష

కలిగిరి, జనవరి4: మండలంలోని అనంతపురం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఫేజ్-2 వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, డాక్టర్ మస్తాన్‌బాబు తెలిపారు. సచివాలయం పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై స్పెషలిస్టు వైద్యులతో చికిత్సలు పొందాలని కోరారు. అలాగే కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు అందచేస్తామన్నారు.

వికసిత్ భారత్ యాత్రపై అవగాహన

లింగసముద్రం, జనవరి 4 : మండలంలోని పెదపవని, ముత్యాలపాడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై గురువారం లబ్ధిదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో యు శేషుబాబు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు ఈ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి టీ అబ్రహాం లింకన్, సచివాలయ సిబ్బంది, పలువురు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.